
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

సోమవారం 11 నవంబరు 2024



- 'కాకాణి' భూ ఆక్రమణ ఫైళ్లు మాయం
- వావిలేటిపాడులో గోవర్ధన్ కుటుంబానికి భూ వివాదం
- 0.90 ఎకరాలు ఆక్రమించినట్లు ఆరోపణలు
- 2017లో నిర్ధారించిన అప్పటి ఆర్డీవో
- సివిల్ కోర్టులో నడుస్తున్న కేసు
- ఎవిడెన్స్ సమర్పించాల్సిందిగా కోర్టు ఆదేశం
- ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో కనిపించని ఫైళ్లు
- కలెక్టర్‌కు లేఖ రాసిన నెల్లూరు ఆర్డీవో నాగ అనూష

నెల్లూరులోనూ 'మదనపల్లె'

నెల్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఫైల్స్ గుర్తున్నాయా..? వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూ అక్రమాలకు సంబంధించిన ఫైళ్లన్నంటినీ అక్కడ తగలబెట్టారు..! ఇప్పుడు అదే తరహాలో నెల్లూరు ఫైల్స్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుటుంబం భూ ఆక్రమణల ఆరోపణలకు సంబంధించిన ఫైళ్లు మాయమయ్యాయి..! అది కూడా ఏదో ఒక చోట అనుకుంటే పొరపాటు.. నెల్లూరు ఆర్డీవో కార్యాలయం, నెల్లూరు తహసీల్దార్ కార్యాలయాల్లో ఈ ఫైళ్లు కనిపించడం లేదు. ఏకకాలంలో రెండు కార్యాలయాల్లో ఫైళ్లు మాయం కావడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ భూ వివాదానికి సంబంధించిన వ్యవహారం ప్రస్తుతం సివిల్ కోర్టు పరిధిలో ఉంది. ఈ కేసు విచారణలో భాగంగా ఎవిడెన్స్‌ను సబ్మిట్ చేయాలని నెల్లూరు ఆర్డీవోను కోర్టు ఆదేశించింది. అయితే ప్రస్తుతం ఆ కేసుకు సంబంధించిన ఫైళ్లు కనిపించకపోవడంతో ఆ విషయాన్ని నెల్లూరు ఆర్డీవో నాగ అనూష కలెక్టర్ ఓ ఆనంద్‌కు లేఖ రాయడం చర్చనీయాంశంగా మారింది.

నెల్లూరు రూరల్ మండలం వావిలేటిపాడులోని సర్వే నెంబరు 272/2ఏలో 10.66 ఎకరాల భూమి ఉంది. అందులో కాటంరెడ్డి అమర్‌నాథ్‌రెడ్డి, మరో ఇద్దరు వ్యక్తులు 1992లో ఆరెకరాల భూమి కొనుగోలు చేశారు. అదే భూమిని 2004లో కాకాణి గోవర్ధన్‌రెడ్డి సతీమణి కాకాణి విజితకు సెటిల్‌మెంట్ చేశారు. అయితే వీరు కొనుగోలు చేసిన సమయంలో ఆ భూమికి పేర్కొన్న హద్దులకు, కాకాణి విజితకు సెటిల్‌మెంట్ చేసిన సమయంలో పేర్కొన్న హద్దులకు తేడా ఉంది. కాగా 272/2ఏ సర్వే నెంబర్లో నిజామ్ మొహిద్దీన్ అనే వ్యక్తికి కూడా భూమి ఉంది. వీరి దగ్గర ఉన్న రికార్డుల ప్రకారం మెహిద్దీన్ కుమారులు వివిధ డాక్యుమెంట్లు ద్వారా 6.20 ఎకరాలను వేరొకరికి విక్రయించారు. ఈ భూమిని పసుపులేటి వెంకటేశ్వర్లు కొనుగోలు చేసి 2007లో అప్రూవ్డ్ లేఅవుట్ వేశారు. ఈ లేఅవుట్‌లో పలువురు ప్లాట్లు కొనుగోలు చేశారు. కాగా 2014లో కాకాణి విజిత తన భూమికి హద్దులు చూపించాలని రెవెన్యూ అధికారులను కోరారు. రెవెన్యూ సిబ్బంది సర్వే చేసి కాకాణి విజిత ఆధీనంలో 4.96 ఎకరాలు ఉందని, అందులో 0.22 ఎకరాలు ఎస్సీల శ్మశానం కూడా ఉన్నట్లు స్కెచ్‌లతో సహా రిపోర్టు ఇచ్చారు. దీనిపై కాకాణి విజిత ఆ వెంటనే హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ తర్వాత మరోసారి సర్వే చేసిన రెవెన్యూ సిబ్బంది మళ్లీ కూడా కాకాణి విజిత ఆధీనంలో 4.96 ఎకరాలు మాత్రమే ఉందని, అందులో 0.22 ఎకరాల ఎస్సీల శ్మశానం ఉందని నిర్ధారించి కోర్టుకు నివేదించారు. ఆ తర్వాత రిట్ పిటిషన్‌ను విత్‌డ్రా చేసుకున్నారు.

ఇదిలా ఉండగా తమ ప్లాట్లు ఆక్రమించారంటూ లేఅవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన పలువురు వ్యక్తులు 2016 అక్టోబరులో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై 2017లో మరోసారి 272/2ఏ సర్వే నెంబర్‌లోని భూమిని రెవెన్యూ సిబ్బంది సర్వే చేశారు. దాని ప్రకారం లేఅవుట్‌కు సంబంధించిన 0.96 సెంట్ల భూమిని కాకాణి విజిత ఆక్రమించినట్లు అప్పటి ఆర్డీవో కే వెంకటేశ్వర్లు తన నివేదికలో పేర్కొన్నారు. 272/2ఏ సర్వే నెంబర్‌లో మొత్తం 10.66 ఎకరాల భూమి ఉండగా వివిధ డాక్యుమెంట్ల ద్వారా 12.20 ఎకరాల విక్రయం జరిగినట్లు ఆయన వెల్లడించారు. ఈ క్రమంలో ఎవరి డాక్యుమెంట్లు సరైనవి..? అన్నది సివిల్ కోర్టులో తేల్చుకోవాలని ఆర్డీవో సూచించారు. ఈ నివేదికను 2017 జనవరి 16వ తేదీన కలెక్టర్‌కు పంపారు.



● కలెక్టర్‌కు ఆర్డీవో లేఖ

వావిలేటిపాడులో కాకాణి విజిత తమ లేఅవుట్ ప్లాట్లను ఆక్రమించారని ఆరుగురు నెల్లూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సూట్ దాఖలు చేశారు. తాము రిజిస్ట్రేషన్ల ద్వారా కొనుగోలు చేశామని, అప్రూవ్డ్ లేఅవుట్‌లోని తమ ప్లాట్లను ఆక్రమించారంటూ సూట్‌లో పేర్కొన్నారు. మొత్తం ఆరు సివిల్ సూట్‌లు ప్రస్తుతం కోర్టులో నడుస్తున్నాయి. వీటిపై విచారణ జరుగుతున్న క్రమంలో వివాదాస్పద భూమికి సంబంధించి ఎవిడెన్స్ సబ్మిట్ చేయాలని నెల్లూరు ఆర్డీవోకు కోర్టు నుంచి సమన్లు అందాయి. 2017లో అప్పటి ఆర్డీవో ఇచ్చిన నివేదికను ప్రస్తుత ఆర్డీవో కోర్టుకు సమర్పించాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫైల్ ఆర్డీవో కార్యాలయంలో కనిపించడం లేదు. కార్యాలయం మొత్తం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో నెల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో

- మిగతా 6లో




కుప్పురపాడులో ఆందోళన చేస్తున్న రైతులు

ఇంత నిర్లక్ష్యమా ?

- కనెక్షన్‌కు రూ.16వేలు చెల్లించాం... ● ఏడాది అయినా రాని కరెంటు
- విద్యుత్ అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం ● కుప్పురపాడులో ఆందోళన

ఏఎస్‌పేట, నవంబరు10 (ఆంధ్రజ్యోతి) : పొలాల్లో విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆదివారం మండలంలోని కుప్పురపాడులో రైతులు ఆందోళన చేపట్టారు. బాధితుల కథనం మేరకు, గ్రామానికి చెందిన 49మంది రైతులు తమ పొలాల్లో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని సుమారు ఏడాది క్రితం అప్పటి ఏఈ నిరంజన్‌ను కలిసి విన్నవించారు. అంతేకాక కనెక్షన్‌కు రూ. 16వేలు చొప్పున సుమారు రూ. 8లక్షల వరకు చెల్లించారు.అయినా విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయలేదు. రైతుల ఒత్తిడితో పొలాల్లో స్తంభాలు నాటారేతప్ప.. వాటికి తీగలు, ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయలేదు. నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు అవేదన వ్యక్తం చేశారు.కరెంటు లేక పొలాలు సాగు చేసుకోలేక సుమారు 500 ఎకరాలు బీడగా మారిందని వారు పేర్కొన్నారు.



పొలాల్లో తీగలు లేకుండా ఉన్న స్తంభాలు

ఇప్పటి కైనా విద్యుత్‌శాఖ జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమ పొలాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని వారు కోరుతున్నారు.

అతను ఇరవై ఏళ్లపాటు దేశ రక్షణకు సరిహద్దుల్లో కాపలా కాశాడు. ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించిన ఆ సైనికుడికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం సాగు చేసుకునేందుకు భూమిని కేటాయించాలి. కానీ సరిహద్దుల్లో ధైర్యంగా శత్రువులతో పోరాడిన ఆ సైనికుడు.. జిల్లాలోని రెవెన్యూ యంత్రాంగంతో మాత్రం పోరాడలేకపోయాడు. భూమి కోసం ఇరవై ఏళ్లుగా పోరాడి పోరాడి గతేడాది అనారోగ్యంతో ప్రాణాలు విడిచాడు. ఆ మాజీ సైనికుడికి భూమి కేటాయింపునకు సంబంధించిన ఫైల్ కలెక్టరేట్‌కు చేరాక మాయ మైంది. ఇప్పుడు ఆ సైనికుడి కుటుంబ సభ్యులు కాళ్లరిగేలా తిరుగుతున్నా ఆ ఫైల్ మాత్రం కలెక్టరేట్‌లో కనిపించకపోవడం గమనార్హం.

నెల్లూరు రూరల్ మండలంలో తన భూమిని నిబంధనలకు విరుద్ధంగా, తనకు తెలియకుండా మ్యుటేషన్ చేశారని ఓ వ్యక్తి రెండేళ్ల నుంచి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతు న్నాడు. ఏడాదిపాటు తిరిగాక అప్పటి కలెక్టర్ విచారణకు ఆదేశిం చారు. ఆ వెంటనే తహసీల్దార్, ఆర్డీవోలు విచారణ జరిపి నిబంధనలకు విరుద్ధంగా మ్యుటేషన్ చేశారని నిర్ధారించి కలెక్టరేట్‌కు నివేదిక పంపారు. ఈ ఫైల్ దాదాపు ఏడాది కాలం కనిపించ కుండా మాయ మైంది. సదరు బాధితుడు మరో ఏడాదిపాటు తిరిగి అతికష్టం మీద ఫైల్‌ను బయటకు తీయించుకు న్నాడు. అప్పటికిగానీ ఈ రిపోర్టు కలెక్టర్ దృష్టికి వెళ్లలేదు.

ఏ పని చేయాలన్నా దానికి ఒక క్రమ పద్ధతి ఉంటుంది. అది లేకపోతే గందరగోళ పరిస్థితులు నెలకొంటాయి. జిల్లా పరిపాలనా కేంద్రమైన కలెక్టరేట్‌లో ఇప్పుడు అదే జరుగుతోంది. అక్కడి సెక్షన్లలో నిర్దిష్టమైన ప్రణాళికను అమలు చేయకపోతుండటంతో సామాన్యులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వారి సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను ఎలాగోలా తంటాలు పడి కలెక్టరేట్ వరకు తీసుకొస్తున్నప్పటికీ అక్కడి నుంచి ముందుకు కదలడం లేదు. కొన్ని దస్త్రాలైతే అసలు కనిపించడం లేదు. ఈ కారణంగా ఏళ్లతరబడి పరిష్కారానికి నోచుకోని ఫైళ్లు మురుగునపడి పోతున్నాయి. వాటికోసం ప్రజలు కాళ్లరిగేలా తిరిగి తిరిగి అలసిపోతున్నారు.

- నెల్లూరు, ఆంధ్రజ్యోతి

ఏ ఫైల్ ఎక్కడుందో?



కలెక్టరేట్‌లోని ఓ విభాగంలో ఉద్యోగులు

- కలెక్టరేట్‌లో అస్తవ్యస్తంగా పాలన ● భారీగా పేరుకుపోయిన దస్త్రాలు
- కొన్ని మాయమవుతున్న వైనం ● ఏళ్ల తరబడి పరిష్కారం కరువు
- భూసమస్యలవే అధికం ● కాళ్లరిగేలా తిరుగుతున్న సామాన్యులు
- పెండింగ్ వివరాలివ్వాలని కలెక్టర్ ఆదేశం
- పాలనాకేంద్రంలో ప్రక్షాళన అవశ్యం!

జిల్లా పరిపాలనకు మూల కేంద్రం కలెక్టర్ కార్యాలయం. అందులో పలు విభాగాలు, వందలాది మంది ఉద్యోగులు ఉన్నాయి. అయితే సరైన పనివిధానాన్ని అనుసరించక పోతుండటంతో కార్యకలాపాలు సజావుగా సాగే పరిస్థితి లేకుండాపోయింది. ఏ ఫైల్ ఎక్కడుందో తెలుసుకోవడం చాలా కష్టంగా మారుతోంది. సెక్షన్‌లోని ఒక అధికారిగానీ, ఉద్యోగిగానీ బదిలీ అయితే అప్పటి వరకు జరిగిన వ్యవహారాలు తదుపరి వచ్చే వారికి తెలియడం లేదు. గతంలో తప్పులు చేసిన కొందరు ఉద్యోగులు, వారు బదిలీ అవుతూనే సదరు ఫైళ్లను మాయం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దరఖాస్తుదారుడు వచ్చి తన ఫైల్ ఏమైందని అడిగితే కొత్తగా వచ్చిన ఉద్యోగులు మళ్లీ మొదటి నుంచీ ఆ ప్రక్రియ మొదలు పెట్టాల్సి వస్తోంది. అంతకన్నా ముందు ఆ ఫైల్ ఎక్కడుందో వెతుక్కోవడం చాలా కష్టంగా మారుతోంది. నిబంధనల ప్రకారం తహసీల్దార్ కార్యాలయంగానీ, ఇతర కార్యాలయాల నుంచిగానీ వచ్చే ఫైళ్లను వాటి ప్రాధాన్యతను బట్టి నిర్దిష్ట సమయంలోపు పరిష్కరించాల్సి ఉంటుంది. కానీ కలెక్టరేట్‌లో వేల ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని అయితే ఏళ్లు గడిచినా అక్కడి నుంచి బయటకు రావడం లేదు. ప్రధానంగా ల్యాండ్ మేటర్స్ సెక్షన్‌లోనే వందల సంఖ్యలో ఫైళ్లు మూలుగుతున్నాయి. వీటిని పరిశీలించి అసలు ఏది వాస్తవం..? అన్నది తేల్చితే బాధితులు కూడా పదే పదే కలెక్టరేట్ చుట్టూ తిరిగే అవసరం ఉండదు.

● రిజిస్టర్ల నిర్వహణ ఏది?

కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ప్రతీ ఉద్యోగి, అధికారి పర్సనల్ రిజిస్టర్ (పీఆర్)ను నిర్వహించాల్సి ఉంటుంది. ఆ ఉద్యోగి వద్దకు వచ్చిన ప్రతీ ఫైల్ వివరాలను ఆ రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. ఆ ఫైల్‌ను ఉన్నతాధికారులు పరిశీలించి డిస్పాచ్ చేశాక ఆ వివరాలను కూడా పీఆర్‌లో నమోదు చేస్తారు. పెండింగ్‌లో ఉన్న ఫైళ్ల వివరాలను మరుసటి ఏడాది క్యారీ ఫార్వర్డ్ రిజిస్టర్‌లోకి తీసుకురావాల్సి ఉంటుంది. దీని మూలంగా ఏ ఫైల్ ఎప్పుడొచ్చింది..? ఏ స్థితిలో ఉంది..? అన్న వివరాలు సులభంగా తెలుసుకోవచ్చు. అలానే సదరు అధికారి లేదా ఉద్యోగి బదిలీ అయిన తర్వాత ఈ రిజిస్టర్లను తదుపరి వచ్చే వారికి అప్పగిస్తే వారికి కూడా తక్షణం అవగాహనకు వస్తుంది. విధులు అప్పగించ డంలో ఇది కూడా ఒక భాగం. కానీ ఇప్పుడు

- మిగతా 6లో

బాలల్ని బందిస్తే జైలే !

బాల కార్మిక రహిత జిల్లాయే లక్ష్యం

- వివరాలు 6లో


ప్రజలకు విజ్ఞప్తి

మేము, ఫెర్టిలైట్ గ్రీన్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, సర్వే నెంబర్ 278, 279, 282, 283, 284, 285, 286, 287, 288, 306 కొత్తపల్లి కోరుగుంట గ్రామం, దగదర్తి మండలం, ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు వద్ద 2×100 KLPD ఇథనాల్ యూనిట్, 2x2.4 MW కోజెనరేషన్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించాము. దీనికి పర్యావరణ మంత్రిత్వ శాఖ, అటవీ మరియు వాతావరణ మార్పులు ఢిల్లీ పర్యావరణ అనుమతి ద్వారా తేది: 04-11-2024 ఆర్డర్ నెంబరు: IA-J-11011/114/2024-14-11(1) పర్యావరణ అనుమతులు పొందింది. క్లియరెన్స్ లెటర్ కాపీలు MOEF & CC / ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ వద్ద లభ్యం అవుతాయి.

Sd/- ఫెర్టిలైట్ గ్రీన్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్,
ములుముడి రెసిడెన్సీ, రామమూర్తి నగర్, నెల్లూరు, ఆంధ్రప్రదేశ్ - 524 003.

స్వాగత శుభాకాంక్షలు

Apollo SPECIALITY HOSPITALS NELLORE



ప్రముఖ కాస్మోటిక్ & ప్లాస్టిక్ సర్జన్
డా॥ పి.శ్రీనివాసరావు
Sr. Consultant Burns, Plastic Cosmetic and Reconstructive Surgeon

ప్లాస్టిక్ సర్జరీ ప్రొసీజర్స్
- కాలిన గాయాలు, క్యాన్సర్ వలన కలిగే వైకల్యాలకు శస్త్రచికిత్సలు
- యాక్సిడెంట్ వల్ల కలిగే గాయాలకు పునర్నిర్మాణ (Reconstructive Surgery) చికిత్సలు
- పుట్టుకతో వచ్చే అంగ వైకల్యాలకు చికిత్సలు (Congenital Deformaties Correction Surgery)
- గ్రహణ మొర్రి, గ్రహణ అంగలికు (Cleft Lip, Cleft Palate) చికిత్స
- చెవులు లేకపోవుట, చిన్నదిగా ఉండుట మొదలగు వైకల్యాలకు చికిత్సలు
- చేతులు మరియు కాళ్ళ నరములకు చికిత్సలు
- ముఖం మరియు ఎముకల ఫ్యాక్చర్స్ మరియు వైకల్యాలకు చికిత్సలు

కాస్మొటిక్ సర్జరీస్ (Cosmetic Surgeries)
- శరీర ఆకృతి మెరుగుపరుచుకునే శస్త్రచికిత్సలు (లైపోసక్షన్)
- ఆడవారిలో బ్రెస్ట్ రిడక్షన్, బ్రెస్ట్ ఆగ్మెంటేషన్, బ్రెస్ట్ లిఫ్ట్ సర్జరీలు
- మగవారిలో గైనకోమాస్టియా (ఛాతి పెరుగుదల) కరెక్షన్
- హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్, పిఆర్‌పిట్రీట్‌మెంట్
- ఫాట్ ఆగ్మెంటేషన్, ఫిల్లర్ ఇంజెక్షన్లు మరియు ఫేస్‌లిఫ్ట్ సర్జరీలు
- Blepharo Plasy Rhino Plasty
- All Lip Surgeries
- Dimple Plasty (Dimple Reaction)
- Abdomino Plasty (Tummy Tucking)

అపాయింట్‌మెంట్స్ కొరకు సంప్రదించండి.
అపోలో స్పెషాలిటి హాస్పిటల్స్
ముత్తుకూరు రోడ్, నెల్లూరు. Ph : 0861-666 7 333, 235 8 333

జామాయిల్‌కు గ్లోబల్ టెండర్లు

- నేడు తెరవనున్న రెండో విడత బిడ్‌లు ● మార్కెట్‌లో భారీగా పెరిగిన ధరలు
- బిడ్‌లకు పలు అంతర్జాతీయ సంస్థల పోటీ
- తొలివిడతలో దాదాపు రూ.40కోట్లకుపైగా ఆదాయం

నెల్లూరు (వెంకటేశ్వరపురం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా అటవీశాఖ పరిధిలోని జామాయిల్ కర్ర ఆ శాఖకు కాసులు కురిపిస్తోంది. 20 ఏళ్లగా జామాయిల్ కర్రకు గ్లోబల్ మార్కెట్‌లో ధర లేకపోవడంతో వేలం వేయలేదు. జిల్లా అటవీశాఖ పరిధిలోని సుమారు 7,500 హెక్టార్లలో జామాయిల్ సాగు ఉంది. తొలిసారి 2023లో మొదటి విడతలో ఐదు రేంజ్‌ల పరిధిలో దాదాపు 4,000వేల హెక్టార్లను గ్లోబల్ టెండర్‌ల ద్వారా విక్రయించారు. అయితే అప్పటి ధర రూ.3,460 గా ఉంది. దాదాపు 1,40,000 మెట్రిక్ టన్నుల జామాయిల్‌ను విక్రయించారు. దీని ద్వారా అటవీశాఖకు సుమారు రూ.48కోట్ల వరకు ఆదాయం వచ్చింది. రెండో విడతలో 3,500 హెక్టార్లలో దాదాపు 1,02,000 మెట్రిక్ టన్నులు జామాయిల్ విక్రయించేందుకు నిర్ణయించారు. ఇందుకు సంబంధించి గ్లోబల్ టెండర్లకు జిల్లా అటవీశాఖ నోటిఫికేషన్ ఇచ్చింది. ఎక్కువగా కావలి రేంజ్ పరిధిలో 1250 హెక్టార్లు, రాపూరు 550, నెల్లూరు 380, ఆత్మకూరు 480, ఉదయగిరి 850 హెక్టార్ల జామాయిల్ తోటలకు కలిపి 1, 20,000 మెట్రిక్ టన్నుల జామాయిల్ కర్రను వేలం ద్వారా విక్ర యించనున్నారు.



జామాయిల్ తోటలను పరిశీలిస్తున్న టెండర్‌దారులు

● భారీగా డిమెండ్

ప్రస్తుతం జామాయిల్ కర్రకు బహిరంగ మార్కెట్‌లో భారీగా డిమాండ్ పెరిగింది. మొదటి విడతలో రూ.3,460 గా ఉన్న టన్ను ధర ప్రస్తుతం రూ.7వేలకు పెరిగింది. దీంతో రెండో విడతలో జిల్లా పరిధిలోని ఐదు రేంజ్‌ల పరిధిలో 3500 హెక్టార్లకు టెండర్లు పిలిచారు. ఆన్‌లైన్ గ్లోబల్ టెండర్ల కోసం ఫైబడ్, యుపీసీలు తయారు చేసే పలు అంతర్జాతీయ కంపెనీలు అయిన ఐటీసీ, 24 సెంచూరి కంపెనీలు పోటీ పడుతున్నాయి. శుక్రవారంతో ఆన్‌లైన్ టెండర్ల గడువు ముగిసింది. సోమవారం (నేడు) బిడ్‌లను తెరవనున్నారు.

నేడు బిడ్‌లు తెరుస్తాం...

జిల్లాలోని సుమారు 3,500 హెక్టార్లలోని జామాయిల్ కర్రకు గ్లోబల్ టెండర్లను ఆహ్వానించాం. ఈ నెల 8ని చివరితేదీగా నిర్ణయించాం. పలు అంతర్జాతీయ కంపెనీలు బిడ్‌లు దాఖలు చేశాయి. సోమవారం ఉదయం మా కార్యాలయంలో ఆన్‌లైన్ టెండర్లను తెరవ నున్నాం.

- మహబూబ్ బాషా, డీఎఫ్‌వో, నెల్లూరు

బహిరంగ ప్రకటన

ICICI Bank

నమోదిత కార్యాలయం: ICICI బ్యాంక్ టవర్, చక్లీ సర్కిల్ సమీపాన, ఓల్డ్ పద్రా రోడ్, వడోదర - 390007
కార్పొరేట్ కార్యాలయం: ICICI బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, ముంబాయి - 400051

బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన

బంగారు ఆభరణాల సౌకర్యం నిమిత్తం ICICI బ్యాంక్ లిమిటెడ్ (ICICI బ్యాంక్) నుండి పొందిన (సౌకర్యం) తమ బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా [illegible] నోటీసు జారీచేయడమైనది. వారు బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాలను నవంబర్ 21, 2024న ఇ-వేలం వేయడానికి మాకు [illegible] ఇ-వేలం తేదీని మార్చు చేయడానికి ICICI బ్యాంక్‌కు అధికారం ఉంది. వేలం -https://gold.samil.in ఆన్‌లైన్‌లో మ.12:30 గం. నుండి మ.3:30 గం. మధ్య నిర్వహించబడుతుంది. సవివరమైన నియమ నిబంధనల కోసం ఇవ్వబడిన వెబ్‌సైట్‌కు లాగిన్ అవండి. మరణించిన రుణగ్రహీత విషయంలో, వారి న్యాయవారసులకు అన్ని నియమ నిబంధనలు వర్తిస్తాయి.

రుణ ఖాతా నెం.	వినియోగదారు పేరు
శాఖపేరు: [illegible]	
758405001847	[illegible]
758405002230	[illegible]
శాఖపేరు:బాపట్ల - ఆంధ్రప్రదేశ్	
358305005113	[illegible]
358305005358	[illegible]
358305001724	[illegible]
శాఖపేరు:బాపులపాడు-హనుమాన్ జంక్షన్	
412805002687	[illegible]
శాఖపేరు:చిలకలూరిపేట	
280505007820	షేక్ మహబూబ్ సుబాని
280505007401	[illegible]
శాఖపేరు:[illegible]	
238605001467	[illegible] పవన్ కుమార్
శాఖపేరు:గొల్లపూడి- ఆంధ్రప్రదేశ్	
363005002078	[illegible]
శాఖపేరు:గుంటూరు	
630705030941	[illegible]
630705030754	[illegible]
శాఖపేరు: గుంటూరు-కొత్తపేట	
664905602055	[illegible] కుమార్
శాఖపేరు:గుంటూరు-పట్నంబజార్	
058905009466	[illegible]
శాఖపేరు:జగ్గయ్యపేట	
179705005783	[illegible]
శాఖపేరు:[illegible]	
053405017796	[illegible]
శాఖపేరు:కైకలూరు -ఆంధ్రప్రదేశ్	
377405000410	[illegible]
377405000418	[illegible]
శాఖపేరు: [illegible]	
069705022334	[illegible] ప్రసాద్
శాఖపేరు: [illegible]	
069805018132	[illegible]
069805018128	[illegible]
069805017236	[illegible]
శాఖపేరు: [illegible]	
069305013226	[illegible]
శాఖపేరు: [illegible]	
377905002751	[illegible]
శాఖపేరు:మాచర్ల-ఆంధ్రప్రదేశ్	
377005003976	[illegible]
377005002354	వెంకటేశ్వరరావు [illegible]
377005002474	వెంకటేశ్వరరావు [illegible]
377005003152	వెంకటేశ్వరరావు [illegible]
377005002045	[illegible]
377005003496	[illegible]
శాఖపేరు:[illegible]	
395105003134	[illegible]
శాఖపేరు: [illegible]	
307505000699	[illegible]
307505000494	[illegible] కుమార్
శాఖపేరు:[illegible]	
751905000788	[illegible] కుమార్
శాఖపేరు:[illegible]	
067905021216	[illegible]
067905020244	[illegible]
శాఖపేరు:నెల్లూరు	
631005022441	[illegible]
శాఖపేరు:[illegible]	
131305008713	[illegible]
శాఖపేరు: [illegible]	
069905010702	[illegible]
శాఖపేరు:[illegible]	
070105015892	[illegible]
070105016843	[illegible]
070105015640	[illegible]
070105015704	[illegible]
070105015817	[illegible]
శాఖపేరు: [illegible]	
236805001953	[illegible]
శాఖపేరు: [illegible]	
378005003677	[illegible]
శాఖపేరు: [illegible]	
044005008056	[illegible]
శాఖపేరు: [illegible]-ఆంధ్రప్రదేశ్	
362605000818	[illegible]
శాఖపేరు: విజయవాడ-[illegible]	
438005000162	[illegible]
శాఖపేరు: విజయవాడ [illegible]	
030305005737	[illegible]
శాఖపేరు: [illegible]-ఆంధ్రప్రదేశ్	
375905002289	[illegible]
శాఖపేరు:[illegible]	
222605000796	[illegible]
శాఖపేరు: హైదరాబాద్-[illegible]	
238405000779	[illegible]
శాఖపేరు: [illegible]	
070305014478	[illegible]
శాఖపేరు: [illegible]	
069105022523	[illegible]
069105021442	[illegible]

తేది: 11.11.2024 , ప్రదేశం: బాపట్ల, గుంటూరు, పల్నాడు, కృష్ణా, ఎన్టీఆర్, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, శ్రీకాకుళం, పశ్చిమగోదావరి,ఏలూరు, పార్వతీపురం మన్యం, మెదక్, జగ్గయ్యపేట, వరంగల్

సం/- అధీకృత అధికారి, ICICI బ్యాంక్ లిమిటెడ్ తరఫున

- 17 నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు
- వెళ్లి, వచ్చే మార్గాల్లో పుణ్యక్షేత్రాల దర్శనం
- టికెట్, అద్దె ప్రాతిపదికన సర్వీసులు
- భక్తులకు రవాణా సంస్థ ఆఫర్లు



శబరిగిరి యాత్రకు పోదాం!

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప స్వామి దర్శనానికి శబరిమలకు వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ సంస్థ ప్రత్యే కంగా బస్సులు నడపనుంది. చార్జీ, అద్దె ప్రాతిపదికన ఈ బస్సులు నడి పేందుకు సన్నద్ధమైంది. ఈ నెల 17వ తేదీన చార్జీ ప్రాతిపదికన మొద టి బస్సు నెల్లూరు ప్రధాన బస్టాండు నుంచి బయలుదేరుతుంది. వచ్చే ఏడాది జనవరి 7వతేదీ వరకు సర్వీసులు కొనసాగించేలా ఆర్టీసీ అధికా రులు ఏర్పాట్లు చేశారు. ఆన్‌లైన్‌లోగానీ, నేరుగా బస్టాండ్లలోని రిజర్వే షన్ కేంద్రాల్లోగానీ సీట్లు బుక్ చేసుకోవచ్చు. శబరిగిరి యాత్రకు వెళ్లే భక్తులకు ఆర్టీసీ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది.

చార్జీ ప్రాతిపదికన ఇలా..

చార్జీ ప్రాతిపదికన ప్రయాణించే వారి కోసం నెల్లూరు ప్రధాన బస్టాండు నుంచి బయలుదేరే బస్సు కాణిపాకం, భవాని, ఎరిమేలి, పంబ మీదుగా శబరిమలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కుర్తాళం, మధురై, చెన్నై, మేళ్మరు వత్తూర్ మీదుగా నెల్లూరు ప్రధాన బస్టాండుకు బస్సు చేరుకుం టుంది. ఈ ఐదు రోజుల యాత్రకు ఒక్కొక్కరికి సూపర్ లగ్జరీ బస్సులో రూ.4వేలు, అల్ట్రా డీలక్స్‌లో రూ.3900, ఎక్స్‌ప్రెస్‌లో రూ.3300 చార్జీ వసూలు చేస్తారు. చార్జీ ప్రాతిపదికన బస్సులు ఈ నెల 17, 18, 20, 22, 25, 26, 28 తేదీల్లో, డిసెంబరు 3, 4, 10, 11, 13, 17, 18, 20, 22, 25, 28 తేదీల్లో, 2025 జనవరి 3, 5, 7 తేదీలలో నెల్లూరు ప్రధాన బస్టాండు నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరుతాయి.



అద్దెకు బస్సులు

అయ్యప్ప భక్తులు కోరుకు న్న మార్గంలో పుణ్యక్షేత్రాలు దర్శిం చుకుంటూ శబరిమల యాత్ర సాగించ డానికి ఆర్టీసీ అధికారులు ప్యాకేజీ విధానం లో అద్దె ప్రతిపదికన బస్సులు ఇస్తున్నారు. సూపర్ లగ్జరీ బస్సుకు ఒక కిలో మీటరుకు రూ.57, అల్ట్రా డీలక్స్ బస్సుకు రూ.61, ఎక్స్ ప్రెస్‌కు రూ.62, పల్లెవెలుగు బస్సుకు కిలోమీట రుకు రూ.62 చొప్పున వసూలు చేస్తారు. అద్దె ప్రాతిపదికన రోజుకు 420 కిలోమీటర్లు మాత్రమే లెక్కించ బడతా యని ప్రకటించారు.

టూర్‌ప్యాకేజ్ ఆఫర్లు ఇలా

- సూపర్ లగ్జరీలో ప్రయాణించే భక్తులకు ఆడియో, వీడియో సౌకర్యం.
- మొత్తం బస్సు బుక్ చేసుకుంటే ఏడుగురికి ప్రయాణం ఉచితం.
- బస్సును అద్దె ప్రాతిపదికన బుక్ చేసుకునే గురుస్వాములు, ఏజెంట్లకు రూ.2వేలు కమిషన్ ఇస్తారు. అయితే బస్సును కనీసం ఐదు రోజులకు బుక్ చేసుకోవాలి.



నెల్లూరు మున్సిపాలిటీ గురించి బ్రిటీష్ ప్రభుత్వం రూపొందించిన చట్టంలోని ఓ భాగం

నెల్లూరు పురపాలనకు 142 ఏళ్లు

- 1882లో మున్సిపాలిటీ ఏర్పాటు
- పల్లెలకు పన్ను మినహాయిస్తూ తొలి తీర్మానం
- కార్పొరేషన్‌లో తాజాగా బయటపడిన దస్త్రం

నెల్లూరు పురపాలక సంఘం 1882 ఫిబ్రవరిలో ఏర్పడింది. అంటే 142 ఏళ్ల క్రితం నుంచి నెల్లూరు మున్సిపల్ సేవలు ప్రజలకు అందు తున్నాయి. పల్లెటూరుగా ఉన్న నెల్లూరును అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం లోని కీలక అధికారి లార్డ్ రిప్పన్ మున్సిపాలిటీగా మార్పు చేస్తూ ప్రకటన విడుదల చేశారు. ఈ విషయాలతోపాటు పలు ఆసక్తికర అంశాలు ఉన్న దస్త్రం ఒకటి తాజాగా కార్పొరే షన్‌లో బయటపడటంతో నెల్లూరు మున్సిపాలిటీ చరిత్ర వెలుగులోకి వచ్చింది. ఆ దస్త్రంలోని అంశాలు...

చరిత్ర

● పదిమందితో కమిటీ

142ఏళ్ల క్రితం ఏర్పా టైన నెల్లూరు మున్సిపాలి టీకి జీస్మిత్ ఎస్ స్వాయర్ అనే వ్యక్తి కీలక అధికారిగా వ్యవహరించారు. అప్పట్లో మున్సిపాలిటీ అధ్యక్షుడిగా వార్నర్‌సెట్విన్ వ్యవహరిం చగా, ఉపాధ్యక్షుడిగా జోకే జయరామ నాయుడు పని చేశారు. వీరుకాక మరో 10 మంది సభ్యులతో బ్రిటీష్ ప్రభుత్వం కమిటీని నియమిం చింది. వీరి అధ్యక్షతన 1882 ఏప్రిల్‌లో తొలి సమావేశాన్ని నిర్వహించారు. 1881 డిసెంబరు 8వ తేదీన పల్లెలకు పన్ను మినహాయిస్తూ .. మున్సి పాలిటీలోకి వచ్చిన ప్రాం తాలకు మాత్రమే పన్ను వసూళ్లకు పరిధి విధించాలన్న సిఫార్సు ను తొలి సమావే శంలో ఆమోదించారు. పల్లెటూళ్లకు కూడా పన్ను వసూళు చేసే విధానం ఉండగా అప్ప టికే పేరుకు పోయిన బకాయిలన్నీ రద్దు చేశారు. తాజాగా నెల్లూరులో కలిసిన ప్రాంతాలకు మాత్రమే కొత్త పన్ను విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చినట్లు ఆ దస్త్రంలో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం పేర్కొంది.



పన్ను మినహాయింపు కోరుతూ తొలి తీర్మానం



1882లోని నెల్లూరు మున్సిపాలిటీ దస్త్రం

● ఆ మూడు సామాజిక వర్గాల వారే సభ్యులు

శెట్టి, శాస్త్రి, నాయుడు సామాజిక వర్గాలకు చెందిన వారినే మున్సి పాలిటీలో సభ్యులుగా చేర్చుతూ ఎస్ స్వాయర్ గజిట్ విడుదల చేశా రు. నెల్లూరు మున్సిపాలిటీలో తీసుకుంటున్న చర్యలు, తీసుకోవాల్సిన నిర్ణయాలు, ప్రజలు అందించాల్సిన సేవలు తదితర ఆసక్తికర విష యాలు కూడా మున్సిపాలిటీ పాలకమండలి దస్త్రంలో పేర్కొన్నారు. తాజాగా వెలుగులోకి వచ్చిన అప్పటి బ్రిటీష్ నిర్ణయాలు అందరికీ ఆసక్తి కలిగిస్తున్నాయి.

- నెల్లూరు సిటీ, (ఆంధ్రజ్యోతి)

బాలల్ని బందిస్తే జైలే

- బాలకార్మిక రహిత జిల్లాయే లక్ష్యంగా అడుగులు
- మూడు శాఖలతో ప్రత్యేక టీం ఏర్పాటు
- జిల్లా వ్యాప్తంగా ముమ్మర తనిఖీలు
- పట్టుపడితే కేసుల నమోదు

నెల్లూరు(క్రైం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అడుగులు పడుతున్నాయి. జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు జిల్లా బాలల సంరక్షణ విభాగం, ఏహెచ్‌టీయూ, లేబర్ డిపార్ట్‌మెంట్‌లు సంయుక్తంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకున్నాయి. జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సైతం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం కృషి చేస్తున్నది. పిల్లల్ని పనికి వాడుకుంటున్న యజమానులపై పలు చట్టాల కింద కేసులు నమోదు చేస్తూ, బాలలను బానిసలుగా మారిస్తే శిక్షలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

● చట్టాల ద్వారా కేసుల నమోదు

పిల్లల్ని పనికి వినియోగించుకుటుఉన్న యాజమాన్యాలపై 79 జేజే యాక్ట్ 2015 ద్వారా కేసులు నమోదు చేసి వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుం టున్నారు. పిల్లల చేత యాచన చేస్తున్నవారిపైన సెక్షన్ 76 జేజే యాక్ట్ 2015, ఎంప్లాయింగ్ బెగ్గింగ్ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తున్నారు. పిల్లల చేత వెట్టిచాకిరీ చేయించే వారిపైన వెట్టిచాకిరీ నిర్మూలన చట్టం 1976, సెక్షన్ 16 కింద కేసు పెడుతున్నారు. బాల కార్మిక రహిత జిల్లాగా చేసేందుకు ప్రత్యేక బృందాలు ఇటీవల ముమ్మర తనిఖీలు, దాడులు నిర్వహిస్తున్నారు.

సంవత్సరం	పాఠశాల వెళ్లే చిన్నారులు	కుటుంబ సభ్యులకు అప్పగించిన బాలలు	విద్యాసంస్థలకు పంపిన బాలలు	నమోదైన కేసులు
2022	168	168	0	96
2023	44	44	0	10
2024	44	43	1	4



అధికారులు కాపాడిన చిన్నారులు

హెల్ప్‌లైన్‌కి సమాచారం ఇవ్వండి

బాల కార్మికులు కనిపిస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ నెం. 1098కి సమాచారం ఇవ్వండి. ఎక్కడైనా దుకాణాలు, కర్మాగారాలు, హేచరీస్‌లలో 18 ఏళ్లలోపు బాలల చేత పనులు చేయిస్తే యాజమాన్యంపైన సెక్షన్ 79, సెక్షన్ 3,4 సీఎల్ కింద కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తాం. బాలల చేత యాచన చేయించే వారిపై సెక్షన్ 76 కింద కేసులు నమోదు చేస్తున్నాం.

- డీ సురేష్, జిల్లా బాలల సంరక్షణ అధికారి

ఇటీవల జరిగిన దాడుల వివరాలు

- కొన్ని హేచరీపైన దాడులు నిర్వహించిన ప్రత్యేక బృందం కొంతమంది బాలకార్మికులను ఒడిస్సా, అస్సోం రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి పని చేయిస్తున్నట్లు గుర్తించి వారిని హోంకి పంపించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.
- వివిధ రకాల పనుల్లో పెట్టుకోవడానికి ఒడిస్సా రాష్ట్రం నుంచి చెన్నైకి రైలులో తరలిస్తుండగా 15 మంది పిల్లల్ని కాపాడి, బాలలను తరలిస్తున్న యజమానిపై ఆర్పీఎఫ్ పోలీసుస్టేషన్‌లో సెక్షన్ 146 - బీఎన్ఎస్ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయించి చర్యలు తీసుకోవడమే కాకుండా, పిల్లల తల్లిదండ్రులకు అప్పగించారు.
- నెల్లూరు నగరంలోని ప్రధాన కూడళ్లలో పిల్లలచేత యాచన చేయిస్తున్న వారిపై వరుసగా దాడులు నిర్వహించి, కేసులు నమోదు చేశారు.

భక్తిశ్రద్ధలతో 'సాయి సచ్చరిత' శోభాయాత్ర

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలోని బాలాజీనగర్ సాయిదర్బార్ ఆధ్వర్యంలో ఆదివారం సాయిమాలా ధారణ భక్తులు సాయిసచ్చరిత్ర గ్రంథాలతో ఊరేగింపు నిర్వహించారు. సాయిదర్బార్ మధు స్వామి అధ్యక్షతన ఈ శోభాయాత్ర పద్మావతినగర్ నుంచి ఆత్మకూరు బస్టాండు వరకు సాయినామ స్మరణ, తీన్‌మార్ బ్యాండ్‌తో సందడిగా సాగిం ది. పాబోలు రామసుబ్బయ్య పర్యవేక్షించారు.



- అనుమతులకు సింగిల్ విండో విధానం
- మంత్రి పొంగూరు నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

పురపాలనలో సంస్కరణలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పురపాలక శాఖలో నూతన సంస్కరణలకు శ్రీకారం చుడుతు న్నట్లు ఆ శాఖ మంత్రి పొంగూరు నారాయ ణ తెలిపారు. నెల్లూరు నగర కార్పొరేషన్ కార్యాలయంలో ఆదివారం బిల్డర్స్ అసోసియే షన్ నేతలు, అధికారులతో మంత్రి సమా వేశం నిర్వహించారు. బిల్డర్లకు, లేవుట్‌దారు లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్ణీత వ్యవధిలోనే అనుమతులు ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. నిబంధ నలకు అనుగుణంగా 2014-19 సంవత్సరాల మధ్య భవన నిర్మాణా లకు ఆన్‌లైన్ ద్వారా అనుమతులు ఇచ్చామని, అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ విధానాన్ని నిర్వీర్యం చేసి టౌన్‌ప్లానింగ్ విభాగాన్ని అవినీతిమ యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టౌన్‌ప్లానింగ్ అప్రూవల్ సిస్టంపై అధ్య యనం చేసేందుకు సుమారు 20 రాష్ట్రాలకు అధికారులను పంపామని, వారు ఇచ్చే నివేదిక ఆధారంగా నూతన సంస్కరణలను తీసుకొస్తామని తెలిపారు. అనుమతులు మరింత సులభతరం చేసేందుకు సింగిల్ విండో విధానాన్ని తీసుకొస్తున్నామన్నారు. మున్సిపల్ శాఖ సర్వర్లతో అన్ని డిపార్ట్ మెంట్ల సర్వర్లను అనుసంధానించి వెబ్‌సైట్ ద్వారానే అనుమతులు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఐదు అంతస్థుల నిర్మాణాల్లో నిబంధనలు అతిక్ర మిస్తే లైసెన్స్ రద్దు చేయడమేకాక వారిపై క్రిమినల్ కేసులు బనాయిస్తామని మంత్రి హెచ్చరించారు. ఈ సమావేశంలో నగర కమిషనర్ సూర్యతేజ, నుడా చైర్మన్‌గా ఎంపికైన కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నారాయణ విద్యాసంస్థల జీఎం విజయ భాస్కర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అమీర్‌జాన్ చిత్రానికి ప్రశంసలు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కేరళలోని వయనాడు తపోవ నంలో జరిగిన దక్షిణ భారత చిత్రకారుల ఆర్ట్ క్యాంప్‌లో నెల్లూరుకు చెందిన అమీర్‌జాన్ చిత్రానికి ప్రశంసలు లభించాయి. ఈ కార్యక్రమాన్ని ఇన్ ద లాఫ్ ఆఫ్ మదర్ నేచర్ సంస్థ నిర్వహించింది. ఈ ఆర్ట్ క్యాంప్‌లో అమీర్‌జాన్ అక్రిలిక్ రంగులతో విశ్వవీక్షణం చిత్రాన్ని ప్రద ర్శించారు.

తుఫాన్ హెచ్చరికతో గుబులు

కందుకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీ డన ప్రభావంతో రానున్న మూడు, నాలుగురోజులపాటు భారీ వర్షాలు కురిసే అవ కాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ప్రస్తు తం కందుకూరు ప్రాంతంలో సాగుచేసిన మినుము ప్రస్తుతం కళ్లె (పూత) దశకు చేరింది. అలాగే సెప్టెంబరు ద్వితీయార్థం, అక్టోబరు ప్రథమార్థంలో తేలికనేలల్లో విస్తారంగా పొగనాట్లు పూర్తిచేశారు. మరోపక్క వందలాది ఎకరాలలో సాగుచేసిన మిరప తోటలు ప్రస్తుతం పూతదశకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో నాలుగురోజుల పాటు భారీవర్షాలు కురిస్తే ఎలా అని రైతుల్లో గుబులు రేకెత్తిస్తోంది. ప్రస్తుతం భారీ వర్షాలు కురిస్తే మినుము పండాకు తెగులుతో దెబ్బతినే ప్రమాదం ఉందని, అలాగే తేలికనేల్లోని పొగతోటలు కూడా దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక ముసురువర్షాలు అయితే మిరపతోటలు పొదిగిపోతాయని చెబుతున్నారు. నల్లనేలల్లో పొగాకు, శనగ సాగుకి ఈ వర్షాలు ఉపయోగపడే అవకాశం ఉన్నా పొగ నారుమడులు దెబ్బతిని నారు ధరలు కొండెక్కి కూర్చునే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. అయితే నల్లనేలల్లో ఎప్పుడు వర్షం కురిసినా నాట్లు వేసేందుకు వీలుగా ఎరువులు ఎదబెట్టి భూములను సిద్ధం చేసి ఉన్నందున వర్షాలు కురిస్తే ఆ వెంటనే పొగనాట్లు ఊపందుకునే అవకాశం ఉంది.

ఏ ఫైల్ ఎక్కడుందో?

(5వ పేజీ తరువాయి)

ఎక్కడా కూడా ఈ విధానాన్ని అనుసరించడం లేదు. దీని మూలంగా ఫైళ్ల నిర్వహణ గందరగోళం గా మారుతోంది. కలెక్టరేట్‌కు వచ్చిన ఫైళ్లను ఎక్క డంటే అక్కడ పెట్టేస్తున్నారు. ఉన్నతాధికారులు ఆ ఫైల్ గురించి అడిగిన ప్పుడు ఉద్యోగులు కొన్ని గంటలపాటు వెతుకుతున్న దృశ్యాలు కనిపిస్తున్నా యి. దీని మూలంగా ఉద్యోగులపై పనిభారం పెరగ డమేకాక ఉన్నతాధికారుల కు కూడా ఇబ్బందిగా మారుతోంది. ఒక ఫైల్ కనిపించకపోతే మళ్లీ కింది స్థాయి నుంచి ఆ ఫైల్‌ను కలెక్టరేట్ వరకు చేర్చాలంటే సామాన్యులు ఎంత అవస్థ పడాల్సి ఉంటుందన్నది వర్ణణాతీతం. రాజకీయ, ఆర్థిక పలుకుబడి ఉన్న వారు ఉన్నతాధికారుల ద్వారా తమ ఫైళ్లను క్లియర్ చేసుకుంటుండగా సామా న్యులు మాత్రం కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

● కలెక్టర్ ఆదేశించినా..

కలెక్టరేట్‌లో ఈ గందరగోళ పరిస్థితిని గమనిం చిన కలెక్టర్ ఓ ఆనంద్ ఇటీవల ప్రక్షాళనకు పూను కున్నారు. అన్ని సెక్షన్ల అధికారులు, ఉద్యోగులకు వారి విధులపై స్పష్టమైన సందేశం ఇచ్చారు. పెండింగ్ ఫైళ్ల వివరాలన్నీ తన ముందుంచాలని ఆదేశించారు. అలానే ఇకపై ప్రతీ సెక్షన్‌లో మూవ్ మెంట్ రిజిస్టర్, పర్సనల్ రిజిస్టర్ నిర్వహించాలని సూచించారు. ఆ క్రమంలోనే కొన్ని సెక్షన్లలో ఇబ్బం దికరంగా మారిన ఉద్యోగులను బదిలీ కూడా చేశా రు. అయినప్పటికీ కలెక్టరేట్ పాలన గాడిన పడటం లేదు, పెండింగ్ ఫైళ్లకు మోక్షం లభించడం లేదు. పెండింగ్ ఫైళ్ల లెక్క తేలకపోవడం గమనార్హం.

నెల్లూరులోనూ 'మదనపల్లె'

(5వ పేజీ తరువాయి)

కూడా జల్లెడ పట్టారు. కానీ ఫలితం లేక పోయింది. ఈనెల 5న కోర్టులో ఎవిడెన్స్ ఇవ్వా ల్సి ఉన్నప్పటికీ ఫైల్ కనిపించకపోవడంతో ఆర్డీవో వాయిదా తీసుకున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యం లో ముఖ్యమైన కేసుకు సంబంధించి ఫైళ్లు మాయమైన విషయాన్ని నెల్లూ రు ఆర్డీవో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తమ కార్యాలయంతో పాటు తహసీ ల్దార్ కార్యాలయంలో కూడా ఆర్‌సీ.జే. 4105/2016 ఫైల్ కనిపించడం లేదని కలెక్టర్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈ ఫైల్ కలెక్టర్ కార్యాలయంలో ఉంటే తమకు కాపీ అందజేయాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్.. వెంటనే జిల్లా రెవెన్యూ అధికారికి ఆదేశాలు ఇచ్చారు. కలెక్టరేట్‌లో వావిలేటిపాడు ఫైల్‌ను వెతికి ఆర్డీవోకు అందజేయాలని సూచించారు. ప్రస్తుతం కలెక్టరేట్‌లో ఫైల్ వెతికే పని జరుగుతోంది. ఈ వ్యవహారం ఇప్పుడు రెవెన్యూ వర్గాల్లోనే కాకుండా రాజకీయ వర్గాల్లో కూడా చర్చనీయాంశంగా మారింది. వావిలేటిపాడులోని భూములకు సంబంధించి కాకాణి కుటుంబంపై గతంలోనే అనేక ఆరోపణలు వచ్చాయి. దళితుల భూములు కూడా ఆక్రమించారంటూ ఫిర్యాదులు రావడంతో గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఆ భూము లను కాకాణి కుటుంబం చెర నుంచి విడిపించి దళితులకు అప్పగించారు. ఇప్పుడు అదే తరహాలో లేఅవుట్లో ప్లాట్లు ఆక్రమించారం టూ మరికొందరు కోర్టును ఆశ్రయించారు. కాగా గతంలో జిల్లా కోర్టులో కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఫోర్జరీ కేసుకు సంబంధించిన ఫైళ్లు దొంగతనం జరగడం, ఇప్పుడు ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయా ల్లో కాకాణి కుటుంబానికి సంబంధించిన భూవివాదం ఫైళ్లు మాయమవడం చర్చనీయాంశంగా మారింది.

విచారణ చేయిస్తాం

వావిలేటిపాడులోని భూవివాదానికి సంబంధించిన ఫైల్ కనిపించడం లేదని నెల్లూరు ఆర్డీవో లేఖ రాశారు. ఈ వివాదం కోర్టులో ఉన్న నేపథ్యంలో సదరు ఫైల్ కలెక్టరేట్‌లో ఉంటే ఇవ్వాలని డీఆర్వోకు సూచించాం. అసలు ఆర్డీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో ఫైళ్లు ఎందుకు కనిపించడం లేదన్న దానిపై విచారణ చేయిస్తాం. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

- ఓ ఆనంద్, జిల్లా కలెక్టర్



దీపోత్సవంలో ప్రవచనం చేస్తున్న విజయానంద స్వామిజీ

వైభవంగా శివపార్వతుల కల్యాణం

- ముగిసిన కార్తీక లక్ష దీపోత్సవం
- శ్రీశైలం నుంచి రథం రాక
- వీఆర్సీ మైదానానికి తరలివచ్చిన భక్తులు

నెల్లూరు (సాంస్కృతికం) (ఆంధ్రజ్యోతి) : వేదమంత్రాలు, శివనామస్మరణలు, మంగళ వాయిద్యాల మధ్య ఆదివారం రాత్రి శివపార్వ తుల కల్యాణం వైభవంగా జరిగింది. శ్రీశైల భ్రమరాంబ సమేత మల్లి కార్జునస్వామి ఉత్సవ మూర్తులకు కల్యాణం జరగడంతో భక్తులు వీఆర్సీ మైదానానికి పోటెత్తారు. వీపీఆర్ ఫౌం డేషన్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీటీడీ పాలక మండలి సభ్యురాలు, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిల ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న కార్తీక లక్ష దీపార్చన ఘనంగా ముగిసింది. మూడవరోజు మహా న్యాస రుద్రాభిషేకాలు, విశేష చండీ హోమాలు జరిగాయి. 500 మంది దంపతులతో సామూ హిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. సాయంత్రం దత్తపీఠం అవధూత విజయానంద స్వామిజీ ఆధ్వర్యంలో నాసిక్ త్రయంబకేశ్వర స్వామికి అభిషేకాలు, బాలరాముని మందరం లో పూజలు, ఆకాశదీపం అవగతం జరిగింది. తదుపరి లక్ష దీపార్చన ప్రారంభించి, భక్తులకు మం గళ శాసనాలు అందించారు. అనంతరం ఆయన అనుగ్రహప్రవచనంలో నెల్లూరులో జరుగుతున్న ఈ కార్తీక లక్షదీపార్చన కోటి దీపా ర్చనగా మారుతుందని తెలిపారు. మహా శివుడు ఆ దంపతులకు అలాంటి శక్తిసామర్థ్యాలు అంద జేస్తారని ఆశీర్వదించారు. నెల్లూరులో ఈ వేడుక లను శాశ్వతం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం శ్రీశైలం నుంచి రథంపై తరలివచ్చిన భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఉత్సవమూర్తులకు కల్యాణం కనుల పండువగా జరిగింది. భక్తులు చేసిన శివనామ స్మరణలు మైదానమంతా మారుమోగాయి.

క్రీడాస్ఫూర్తితో ఆటల పోటీల్లో రాణించాలి

ఆత్మకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : క్రీడాస్ఫూర్తితో విద్యార్థులు ఆటల పోటీల్లో రాణించి జాతీయ స్థాయిలో మన రాష్ట్ర కీర్తి పతాకాన్ని రెపరెపలాడించాలని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో ఆదివారం 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 బాలబాలికల నెట్ బాల్ పోటీలను క్రీడాజ్యోతిని వెలిగించి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని, క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగాల్లో 3 శాతం రిజర్వేషను కల్పిస్తుందని తెలిపారు. రాష్ట్రం నుంచి ఒలంపిక్ క్రీడల్లో గోల్డ్ మెడల్ సాధించిన వారికి రూ. 7 కోట్ల రివార్డును ప్రకటించి సత్కరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆలోచిస్తున్నారన్నారు. పంజాబ్‌లోని లూధియానా, చత్తీస్‌ఘడ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో స్థానం సంపాదించాలనే లక్ష్యంతో క్రీడాకారులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆత్మకూరులో జరిగే నెట్‌బాల్ టోర్నమెంట్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన టీమ్‌లకు, మన రాష్ట్రం నుంచి జాతీయ స్థాయికి ఎంపికయ్యే బృందానికి జెర్సీలను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో బి పావని, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పచ్చా తిరుపతయ్య, పలువురు ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఆయన పట్టణంలోని శ్రీధర్ గార్డెన్స్‌లో జరిగిన టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి కుమార్తె వివాహ కార్యక్ర మంలో పాల్గొని వధువరులను ఆశీర్వదించారు.



క్రీడాజ్యోతిని వెలిగించి టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

అట్టహాసంగా రాష్ట్రస్థాయి నెట్ బాల్ టోర్నమెంట్ ప్రారంభం

ముక్కంటికి సహస్ర శంఖాభిషేకం

నెల్లూరు (సాంస్కృతికం), నవం బరు 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మూల స్థానేశ్వర స్వామికి కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం సహస్ర శంఖాభిషేకం నేత్రపర్వంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, రుద్ర హోమం, విశేష పూజలు, పూలంగిసేవ జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం ప్రత్యేక పూజలు, పూలంగిసేవ, ప్రాకారోత్సవం నిర్వహించారు. ఆలయ ఈవో జే శ్రీనివాసరావు, అర్చకులు సిబ్బంది పర్యవేక్షించారు.



అర్ధరాత్రి పోలీసుల స్పెషల్ డ్రైవ్

నెల్లూరు(క్రైం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు శనివారం రాత్రి 11 గంటల నుంచి అర్ధరాత్రి 1 గంట వరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అన్ని కూడళ్లు, జాతీయ రహదారుల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాల్లో విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. మద్యం సేవించి వాహనాలను నడపటంపై 20 కేసులు, ఓపెన్ డ్రింకింగ్ 37, ఎంవీ యాక్ట్ కేసులు 200 నమోదు చేశారు. 29 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని రూ.1,01,400 అపరాధ రుసుము విధించారు. ఈ సందర్భంగా ఎస్పీ జీ కృష్ణకాంత్ మాట్లాడుతూ నేరపూరిత కార్యక్రమాలు జరగకుండా, అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు క్షుణ్ణంగా వాహనాలు తనిఖీ చేసినట్లు చెప్పారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. లైసెన్స్ లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడపటం, ర్యాష్ డ్రైవింగ్ వంటివి నిర్మూలించేందుకు అధికారు లు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ విజబుల్ పోలీసింగ్ ముమ్మరం చేయాలంటూ దిశానిర్దేశం చేశారు.



వాహనాల తనిఖీని పర్యవేక్షిస్తున్న నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

డివైడర్‌ను ఢీకొన్న మోటార్‌సైకిల్

- స్వర్ణకారుడి దుర్మరణం

మనుబోలు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాత్రి వేళ కునుకు తీశాడో... ఆదమరిచాడో... వెనుక వస్తున్న వాహనం ఢీకొడితే అదుపుతప్పి పక్కకు పోయిందో తెలియదు కానీ.. రోడ్డుపై వెళ్లాల్సిన మోటార్‌సైకిల్ వంతెన పక్కనున్న డివైడర్‌ను ఢీకొంది. అంతే దాని చోదకుడు తూపిలి చంద్ర(44) అనే స్వర్ణకారుడి తల వంతెన గోడకు కొట్టుకొని దుర్మరణం చెందాడు. ఈ ఘటన మనుబోలు వద్ద శనివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు... ఇందుకూరుపేట మండలం కొత్తూరుకు చెందిన చంద్ర కొంతకాలంగా స్వర్ణకారుడుగా జీవనం సాగిస్తున్నాడు. గూడూరుకు చెందిన కస్టమర్లు కొత్త ఆభరణాలు చేయించి ఇవ్వాలని అతనికి ఆర్డర్ ఇచ్చారు. అవి తయారు చేసి మోటార్‌సైకిల్‌పై గూడూరుకు వెళ్లి వారికి ఇచ్చాడు. తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వెళుతూ మనుబోలు వద్ద వంతెనపైకి రాగానే మోటారు సైకిల్ వంతెన పక్కనే ఉన్న డివైడర్‌పైకి దూసుకెళ్లింది. దీంతో మోటార్‌సైకిల్ బోల్తాపడగా చంద్ర తల వంతెన గోడకు బలంగా తగిలి తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ప్రమాదంలో దుర్మరణం చెందిన తూపిలి చంద్ర

దుకాణాల్లోకి దూసుకెళ్లిన టిప్పర్

- త్రుటిలో తప్పిన ప్రమాదం

వరికుంటపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న ఓ టిప్పర్ అదుపుత తప్పి దుకాణాల్లోకి దూసుకెళ్లిన సంఘటన ఆదివారం భోగ్యంవారిపల్లి బస్టాండ్ సెంటర్‌లో చోటుచేసుకుంది. వివరాల మేరకు.. ఇసుక లోడుతో 565 జాతీయ రహదారిపై ప్రకాశం జిల్లా పామూరు వైపు వెళ్తున్న టిప్పర్ ఒక్కసారిగా అదుపుతప్పి రహదారి సమీపంలోని దుకాణాల్లోకి దూసుకెళ్లింది. ఆదివారం కావడంతో పలు దుకాణాలను మూసి వేయడంతో పాటు మధ్యాహ్న సమయంలో ప్రజల రద్దీ తక్కువగా ఉండడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటనతో కొంతమేర దుకాణాలు ధ్వంసమవడంతో సహా ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. కాగా, ప్రమాదానికి కారణమైన డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.



దుకాణాల్లోకి దూసుకెళ్లిన టిప్పర్

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

వెంకటాచలం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదగాలిలో ఆదివారం పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. స్థానికుల నుంచి సీఐ పీ.సుబ్బారావుకు సమాచారం అందడంతో సీఐ తన సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేసి ముగ్గురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2500 స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని విద్యుత్‌శాఖ ఉద్యోగికి తీవ్రగాయాలు

- మెరుగైన వైద్యం కోసం చెన్నైకి తరలింపు

కావలి రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ముందు వెళ్తున్న మోటారు సైకిల్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో దేవరకొండ వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం స్థానిక ముసునూరు జాతీయ రహదారిపై జరిగింది. ముసునూరుకు చెందిన వెంకటేశ్వర్లు విద్యుత్‌శాఖలో ఉద్యోగిగా పని చేసున్నాడు. టోల్ ప్లాజా సమీపంలోని పొలంలో వరినారుకు పురుగుమందు కొట్టేందుకు వెళ్తున్న తండ్రి చలమయ్య, తాతకు ఆసరాగా ఉండేందుకు ఇంజనీరింగ్ చదువుతున్న కుమారుడిని తీసుకుని మోటారు సైకిల్‌పై పొలానికి బయలుదేరారు. మార్గమధ్యంలో రోడ్డు మార్జిన్‌లో వెళ్తున్న వీరి మోటారు బైక్‌ను అతి వేగంగా వెనుకనే చెన్నై వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని పట్టణంలోని ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. కాళ్లు చేతులకు తీవ్రగాలైన వెంకటేశ్వర్లు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం చెన్నై తరలించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	112
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7498
వెండి కిలో ధర	రూ. 93,600
వెండి ఒక గ్రాము	రూ.96.60

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుమూరు పంచాయతీ చింతల పాళెం సమీపంలో ఉన్న మలుపు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నగరంలోని గాంధీనగర్ ప్రాంతానికి చెందిన ఖలీల్, సుల్తాన్‌లు మోటర్ బైక్‌పై కసుమూరు దర్గాకు వెళ్లి తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా మలుపు వద్దకు వచ్చేసరికి ఎదురుగా టిప్పర్ రావడంతో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో వారిద్దరికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కసుమూరులోని ఒక ప్రైవేట్ క్లీనిక్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అమరవీరుల స్తూపం వద్ద డీఎఫ్‌వో, అధికారుల నివాళి

అమరవీరుల ఆశయాలే స్ఫూర్తి

- అటవీ అమరవీరులకు ఘన నివాళి
- ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం

నెల్లూరు (వెంకటేశ్వరపురం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అడవుల సంరక్షణ విధుల్లో ప్రాణాలను వదిలిన ఎందరో అటవీ అమర వీరుల ఆశ యాలు మనందరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా టెరిటోరియల్ డీఎఫ్‌వో మహ బూబ్ బాషా అన్నారు. నెల్లూరులోని అటవీ శాఖ జిల్లా కార్యాలయం లో ఆదివారం అటవీ అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించారు. అమరవీరు ల స్తూపానికి డీఎఫ్‌వో, ఉద్యోగులు, సిబ్బంది నివాళులర్పించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఉద్యోగులు రక్తదానం చేశారు. డీఎఫ్‌వో మాట్లాడు తూ ప్రతీ ఒక్క రూ అమరవీరుల స్ఫూర్తితో విధులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పిచ్చిరెడ్డి, రవిశేఖర్, రవీంద్రబాబు, మల్లికార్జునరావు, ఓంప్రకాష్, వెంకటేశ్వర్లు, నెల్లూరు రేంజర్ మాల్యాద్రి, ఉద్యోగులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న అటవీ ఉద్యోగులు, సిబ్బంది

సొసైటీల వైపు

తమ్ముళ్ల చూపు

ప్రభుత్వ నిర్ణయంలో జాప్యం

ఆరునెలలుగా ఆశాఖ అధికారులే ఇన్‌చార్జిలు

పాలనాపరమైన నిర్ణయాలు తీసుకోలేక సతమతం

రైతులకు ఉపయోగపడని సహకార సంఘాలు

త్రిసభ్య కమిటీలైనా వేయాలంటూ టీడీపీ అధిష్ఠానానికి నేతల వినతి



సంగంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం

సంగం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్‌లు)ను త్రిసభ్య కమిటీలతోనే వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు పాలించింది. ఎమ్మెల్యేలు సిఫారసు చేసిన నేతలకే కమిటీల్లో స్థానం లభించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ కమిటీలను రద్దు చేసి, ఆ శాఖ అధికారులనే ఇన్‌చార్జులుగా నియమించింది. వీటిల్లో ప్రాతినిధ్యం కోసం కూటమి శ్రేణులు ఉత్సాహం చూపుతున్నాయి. ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాయి. ప్రస్తుతం సహకార సంఘాల్లో వీరి మాట చెల్లుబాటు కావడం లేదు. కొత్త వారికి రుణాలు ఇవ్వాలన్నా.. సంఘాలను అభివృద్ధి చేయాలన్న కాంక్ష ఉన్నా ఫలితం లేకపోతుంది. నిబంధనలు ఒప్పుకోవంటూ సిబ్బంది సహకరించడం లేదు. ఇన్‌చార్జిల పాలనలో ఆడిట్ ఇబ్బందులు వస్తాయంటూ దాట వేస్తున్నారు. సంఘాల్లో మౌలిక వసతులు కల్పించే పరిస్థితి లేదు. ఈ పరిస్థితుల్లో ఈ సంఘాల్లో ప్రాతినిధ్యం కోసం ఎదురుచూస్తున్న నాయకులు, కార్యకర్తలు తమ ఆకాంక్షలను ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జుల ముందుంచారు. ప్రభుత్వ ఆదేశించిన వెంటనే అవకాశం కల్పిస్తామంటూ వారు హామీ ఇచ్చారు.

- **డైరెక్టర్లకు అవకాశం**

ఇటీవల ప్రభుత్వం కొన్ని రాష్ట్రస్థాయి కార్పొరేషన్‌లకు రెండు దఫాలుగా డైరెక్టర్లను, చైర్మన్లను నియమించింది. అందులో కొంతమంది పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అవకాశం లభించింది. అదే సహకార సంఘాల్లో కమిటీలను నియమిస్తే ప్రతి నియోజకవర్గంలో పదుల సంఖ్యలోనే పార్టీ శ్రేణులకు పదవులు లభించనున్నాయి.

- **జిల్లాలో 78 పీఏసీఎస్‌లు**

జిల్లాలో 78 పీఏసీఎస్‌లు ఉన్నాయి. త్రిసభ్య కమిటీలు ఏర్పాటు చేస్తే 234 మందికి నామినేటెడ్ పదవులు దక్కనున్నాయి. కొంత కాలంపాటు కమిటీలనే వేయాలంటూ కూటమి నేతలు అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లారు. వీటితోపాటు జిల్లా సహకార బ్యాంకు, డీసీఎంఎస్, మార్కెట్ కమిటీలు, సహకార సంఘాల్లో పదవుల కోసం తమ్ముళ్లు ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపైనే కమిటీలు వేయడం ఆధారపడి ఉంటుంది.

రాష్ట్రాన్ని క్రీడాంధ్రగా మార్చాలన్నదే సీఎం లక్ష్యం

- శాప్ చైర్మన్ రవినాయుడు
- కావలిలో మినీ స్టేడియం పరిశీలన

కావలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని క్రీడాంధ్రగా రూపొందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు క్రీడాకారులను ప్రోత్సహిస్తూ క్రీడాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నాడని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. డిస్ట్రిక్ అథారిటీకి చెందిన కావలి మినీ స్టేడియంను ఆదివారం మధ్యాహ్నం ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గతంలో నిర్మాణం జరిగి నిలిచిన పనులు, స్టేడియం ప్రాంతంలో దాతల సహకారంతో నిర్వహిస్తున్న క్రికెట్ ప్రాక్టీస్‌ను పరిశీలించి విద్యార్థులతో కలిసి కాసేపు సరదాగా క్రికెట్ ఆడారు. అనంతరం జరిగిన సమావేశంలో రవి నాయుడు మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రతి నియోజకవర్గానికి మినీ స్టేడియం, క్రీడా వికాస కేంద్రాలను మంజూరు చేస్తే వాటి నిర్మాణాలు జరుగుతున్న సమయంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో వాటికి రాజకీయ గ్రహణం పట్టిందన్నారు. మరలా చంద్రబాబునాయుడు అధికారంలోకి రావడంతో వాటిపై దృష్టి పెట్టారన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు 3శాతం స్పోర్ట్స్ కోటా పెట్టారని గుర్తు చేశారు. 2027కు రాష్ట్రంలో నేషనల్ గేమ్స్ నిర్వహించేలా సీఎం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. కావలి మినీ స్టేడియంలో 11 గేమ్స్ ఆడేలా మల్టీపర్పస్ స్టేడియంగా మార్చేలా స్థానిక ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి సూచనల మేరకు రూపొంది స్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి మాట్లాడారు. పట్టణ నడిబొడ్డున 9ఎకరాల్లోని మినీ స్టేడియంను అభివృద్ధి చేసేందుకు శాప్ చైర్మన్ కావలికి రావటం అభినందనీయమన్నారు. స్టేడియం నిర్మాణంను ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా డీపీఆర్ రూపొందించి నిధులు మంజూరు చేయాలని కోరారు



మినీ స్టేడియం మైదానాన్ని పరిశీలిస్తున్న శాప్ చైర్మన్, కావలి ఎమ్మెల్యే తదితరులు

- **కావలి అభిరుచికి చిహ్నంగా సెల్ఫీ పాయింట్**

మినీ స్టేడియం పరిశీలన అనంతరం ట్రంకురోడ్డులోని 100అడుగుల జాతీయజెండా ఐలవ్ కావలి పేరుతో ఏర్పాటు చేసిన సెల్ఫీపాయింట్‌ను శాప్‌చైర్మన్ సందర్శించారు. ఎమ్మెల్యేతో కలిసి సెల్ఫీ దిగారు. మహనీయుల చిత్రపటాల గ్యాలరీ, కావలి శాసనసభ్యులుగా పనిచేసిన వారందరి చిత్రపటాలను చూసి సంతోషం వ్యక్తం చేశారు. కావలి ప్రజల అభిరుచికి తగినట్లుగా ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఈ పాయింట్ ఏర్పాటు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో క్రీడాభివృద్ధి జిల్లా అధికారి యతిరాజులు, సూపరింటెండెంట్ విజయ్, నేతలు గుత్తికొండ కిషోర్‌బాబు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, జ్యోతి బాబూ రావు, కండ్లగుంట మధుబాబునాయుడు, పోట్లూరు శ్రీనివాసు, జనసేన నేతలు సిద్దూ, బొప్పా సాయి పాల్గొన్నారు.

కోడూరు బీచ్‌లో గల్లంతైన వ్యక్తి

మృతదేహం గుర్తింపు

తోటపల్లిగూడూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కోడూరు బీచ్‌లో గల్లంతైన ఓ వ్యక్తి మృతదేహం ఆదివారం ముత్తుకూరు మండలం నేలటూరులోని సముద్రం ఒడ్డున లభ్యమైనట్లు ఎస్‌ఐ వీరేంద్రబాబు తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. కోడూరు సముద్రతీరంలో శనివారం కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఆత్మకూరు సురేష్(45) కుటుంబ సభ్యులతో కలిసి సముద్రస్నానం చేస్తుండగా అలలు ఉధృతికి గల్లంతయ్యాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గాలింపు చర్యలు చేపట్టగా ఆదివారం మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నామమాత్రంగా అంతర్ కళాశాలల క్రీడలు

- ముందస్తు సమాచారం లేకుండా నిర్వహణ

నెల్లూరు(విద్య), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి విశ్వ విద్యాలయ అంతర్ కళాశాలల కబడ్డీ పోటీలు, వర్సిటీ జట్టు ఎంపికలు నామమాత్రంగా నిర్వహించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నెల్లూరులో ని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ పోటీలను ఆదివారం అత్యవసరంగా నిర్వహించారు. ఏ సమయంలో పోటీలు నిర్వహిస్తారన్న సమాచారం లేకుండా యూనివర్సిటీ సర్క్యులర్‌ను కళాశాలలకు పంపించడంతో కావలి జోన్ నుంచి ఐదు జట్లు, నెల్లూరు జోన్ నుంచి నాలుగు జట్లు మాత్రమే హాజరయ్యాయి. వర్సిటీ పరిధిలో 150కిపైగా కళాశాలలు ఉన్నప్పటికీ ప్రస్తుతం డిగ్రీ పరీక్షలు జరుగుతుండటం, అత్యవసరంగా పోటీలు నిర్వ హించడంతో పలు కళాశాలలు పాల్గొనేందుకు ఆసక్తి చూపలేదని సమాచారం. దీనికితోడు కొన్ని కళాశాలలకు మాత్రమే లబ్ధి చేకూరేలా కొంత మంది పీడీలు వ్యవహరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జాతీయ స్థాయిలో జరిగే అంతర్ విశ్వవిద్యాలయ క్రీడా పోటీల్లో పాల్గొనే వీఎస్‌యూ జట్టును పక్కాగా ఎంపిక చేయాల్సిన అధికారులు, ఇలా తమకు నచ్చిన ఆటగాళ్లతో జట్టును ఎంపిక చేయడంపై అసంతృప్తి వ్యక్తం అవుతోంది. జరిగిన పోటీల్లో కూడా ఏ జట్టూ పూర్తిస్థాయిలో ప్రతిభ చాటకపోయినా చివరకు కావలి శ్రీసాయి కళాశాల, నెల్లూరు డీకేడబ్ల్యూ కళాశాల జట్లు ఫైనల్స్‌లో తలపడేలా నిర్ణయించారు. ఫైనల్స్‌లోనూ కావలి జట్టు ఏకపక్షంగా విజయం సాధించడం అనుమానాలకు తావిస్తోంది. దీనిపై యూనివర్సిటీ అధికారులు పునః సమీక్షించుకుని తమకు న్యాయం చేయాలని క్రీడాకారులు కోరుతున్నారు.



ఫైనల్స్‌లో తలపడుతున్న క్రీడా జట్లు

కండలేరు నీటిమట్టం 50.6 టీఎంసీలు

రాపూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాపూరు మండలం కండలేరు పూర్తి స్థాయి నీటి మట్టం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 50.6 టీఎంసీలు ఉంది. పైనుంచి ఇన్‌ఫ్లో ఏమీలేకపోగా, ఔట్‌ఫ్లో 1315 క్యూసెక్కులుగా ఉందని కండలేరు డ్యామ్ ఏఈ తిరుమలయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వేధింపులు తాళలేక గిరిజన బాలిక ఆత్మహత్యాయత్నం

నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) : ఓ యువకుడి వేధింపులు తాళలేక గిరిజన బాలిక ఆత్మహత్యకు యత్నించిన విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది. అందిన సమాచారం మేరకు... నెల్లూరు రూరల్ మండలం కొత్త వెల్లండికి చెందిన ఓ బాలిక పదో తరగతి చదువుతోంది. గ్రామానికి చెందిన జాన్ అనే యువకుడు కొంతకాలంగా ప్రేమ, పెళ్లి పేరుతో ఆ బాలికను వేధిస్తు న్నాడు. ఆ వేధింపులు తాళలేక బాలిక చదువు కూడా మానేసింది. అయినప్పటికీ అతడి వేధింపులు పెచ్చుమీరడంతో సదరు బాలిక ఈ నెల 7వ తేదీ పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు 8న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ బాలిక చికిత్స పొందుతోంది. ఈ విషయం ఆదివారం వెలుగులోకి రావడంతో దర్యాప్తు చేస్తున్నామని రూరల్ పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), (ఆంధ్ర జ్యోతి) : నెల్లూరులోని కొత్తహాలు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న స్థానిక వీఆర్వో శివకుమార్ సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ జీ బాలకృష్ణ మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 40 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడని, మృతదేహంపై నలుపు మీద ఎరుపురంగు చారలున్న టీషర్టు, కాఫీ రంగు కాటన్ జీన్స్ ప్యాంట్ ఉన్నాయని తెలిపారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

నెల్లూరు బ్రహ్మదేవంలో NUDA అప్రూవల్ కలిగిన 20.83 అం.. ప్లాటు కేవలం 13,60,000/- మరియు 75% లోను సౌకర్యము కలదు. సం.ప్ర. సెల్:778050 5882

AJR-193827

కావలెను

నెల్లూరు పట్టణం నందు ప్రైవేట్ బ్యాంకులో సెక్యూరిటీ గార్డ్ గ పనిచేయుటకు కావలెను. గమనిక: వయస్సు: 45Y లోపల ఉండవలెను Cell:9381838140, 8500641105.

AJA-198463

PROPERTY TO RENT

★ To let 2BHK recently renovated in Raghava Apartment, Tekkemitta with attached baths and Pooja. Contact Sreedhar 9701234748, 9491340136

AJH-1032

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవీటి

పోలేరమ్మకు పొంగళ్లు



పొంగళ్లు సమర్పిస్తున్న గ్రామస్థులు

సీతారామపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుండుపల్లి పంచాయతీలోని ఓగురువాండ్లపల్లి లో ఆదివారం గ్రామదేవత పోలేరమ్మకు భక్తి శ్రద్ధలతో పొంగళ్లు సమర్పించారు. గ్రామం నుంచి మహిళలు ఊరేగింపుగా అమ్మవారి సన్నిధికి చేరుకుని పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు కటారి వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, శ్రీనివాసులు, వెంటరత్నం పాల్గొన్నారు.

యూటీఎఫ్ కార్యకర్తలకు ఘన సన్మానం

ఏఎస్ పేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలలో భాగంగా స్థానిక హైస్కూల్‌లో ఆదివారం మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ కార్యకర్తలను ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా షేక్ జిలానిపాషా, అధ్యక్షుడిగా కంచర్ల వరప్రసాద్, అసోసియేట్ అధ్యక్షులుగా ఇ శ్రీనివాసులు, యశోదమ్మ, కార్యదర్శులు, సభ్యులను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఏ మురళీధర్‌రావు, బి శివప్రసాద్, ఆడిట్ కమిటీ సభ్యులు మల్లికార్జున రావు పాల్గొన్నారు.

గ్రామాల్లో జ్వరాల విజృంభణ

● పడకేసిన పారిశుధ్యం ● పట్టించుకోని అధికార గణం



వైద్యశాలలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

ఉదయగిరి రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రతి ఇంట్లో ఒకరిద్దరు చొప్పున జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతూ ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. కొంతమందికి రోజుల తరబడి జ్వరం తగ్గకపోవడంతో రక్తకణాలు తగ్గి ఇతర ప్రాంతాల్లో చికిత్స పొందుతున్నారు. దీంతోపాటు పట్టణం, గ్రామం అనే తేడాలేకుండా ఎక్కడ చూసినా పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తూ దోమలు విజృంభిస్తుండడంతో జ్వరాలు ప్రబలుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. వీధులు శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లిన పాపాన పోలేదని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికంగా చిన్నారులు, మహిళలు జ్వరాలతో బాధపడుతున్నారు. సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు, వింజమూరు మండలాల్లోని పలు గ్రామాల్లో పలువురు జ్వరాలతో వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు. మరికొందరికి రక్తకణాలు తగ్గడంతో నెల్లూరు, ఆత్మకూరు, వింజమూరు పట్టణాల్లో చికిత్స పొందుతున్నారు. జ్వరం తగ్గినా రోజుల తరబడి ఒళ్లు, కీళ్లనొప్పులు తగ్గకపోవడంతో ఏ పనీ చేయలేక పోతున్నామని జ్వరపీడితులు వాపోతున్నారు. ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి, పలు ప్రైవేటు వైద్యశాలలకు రోజుకు 300 మంది రోగులు వస్తుంటే అందులో 70 శాతం మంది జ్వరపీడితులే ఉన్నారని ఆయా వైద్యశాలల వైద్యులు తెలుపుతున్నారు. వైద్యఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో తూతూమంత్రంగా లార్వా జ్వరాల సర్వే నిర్వహిస్తూ ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టడంతోపాటు జ్వరాలను అదుపులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

రైతులందరికీ సంక్షేమ పథకాలు

● రవికుమార్, మండల వ్యవసాయాధికారి



వరికుంటపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు తమవంతు బాధ్యతగా కృషి చేస్తున్నామని మండల వ్యవసాయాధికారి వి రవికుమార్ తెలిపారు.

? రైతులకు విత్తనాల సరఫరాలో ఎ లాంటి చర్యలు చేపడుతున్నారు.

! ప్రస్తుత సీజన్‌లో ప్రభుత్వం తరఫున తెల్ల, ఎర్ర శనగల పంపిణీ జరుగుతుంది. అందుకుగాను రైతుల నుంచి గ్రామాల్లో రిజిస్ట్రేషన్లు చేపడుతున్నాం.

? మార్కెట్ ధరల్లో వ్యత్యాసం ఉంటుందా.

! బయటి మార్కెట్‌లో ధర అధికంగా ఉంటుండడంతో ప్రభుత్వం 25శాతం రాయితీతో 20 కేజీల తెల్ల శనగలు రూ. 1815, ఎర్ర శనగలు రూ. 1410 వంతున అందచేస్తాం.

? రైతులకు ఎరువులు అందించే అవకాశం ఉందా.

! ప్రస్తుతం సొసైటీ కార్యాలయానికి సమీపంలో ఉండే రైతుసేవా కేంద్రాలకు ఎరువుల సరఫరా నిలిపివేయడం జరిగింది. మిగిలిన ప్రాంతాల్లో రైతుల అవసరం మేరకు అందిస్తాం.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణ మహోత్సవంలో బ్రాహ్మణ సంఘాల ప్రముఖులు

కావలి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ మహాసంఘం ఆధ్వర్యంలో స్థానిక మునునూరు అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం శివపార్వతుల కల్యాణంను వైభవంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు పీవీఎస్ ప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన మహోత్సవంలో ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామికి మొక్కుకున్నారు. అనంతరం భక్తులకు వనసమారాధన అన్న సంతర్పణ గావించారు. ఉత్సవంలో బ్రాహ్మణ సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఇనుకపల్లి కామేశ్వరప్రసాద్, బ్రాహ్మణ మహాసంఘం బాధ్యులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్‌లో నూతనంగా నిర్మించనున్న అంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, అనసూయమ్మ దంపతులు పాల్గొన్నారు.

కమనీయం దుర్గామల్లేశ్వర స్వామి కల్యాణం



దుర్గామల్లేశ్వర స్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఉలవపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక కనకదుర్గమ్మ ఆలయంలో దుర్గామల్లేశ్వర స్వామి వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం కల్యాణం నిర్వహించారు. ఈ వేడుకల్లో విగ్రహ దాతలు చిట్టూరి సూర్యనారాయణ కుటుంబ సభ్యులతో పాటు పోన్నూరు రామాంజనుయుల దంపతులు, భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆలయ నిర్వాహకులు సురేంద్రరెడ్డి, కమిటీ సభ్యులు దేవరపల్లి దయాకర్‌రెడ్డి, పేర్ల వెంకటేశ్వర్లు, సన్నెబోయిన గోవిందరాజులు, కొడవలూరి శ్రీనివాసులు, బండ్ల శ్రీనివాసులు, ఎస్ హరిలు భక్తులకు తీర్థ ప్రసాదాలతోపాటు అన్నవితరణ చేశారు. సాయంత్రం భవానీ మాలధారులు స్వామి గ్రామోత్సవం నిర్వహించారు.

సీపీఎం పతాకావిష్కరణ

ఉదయగిరి రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆదివారం సీపీఎం జెండా ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఉపాధిహామీ పనుల్లో కోతలు విధించడంతో పనులు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులు, భూములు స్వాధీనం చేసుకునేందుకు కూడా త్వరలో జీవో తీసుకొచ్చేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం సైతం విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై భారం మోపడం దారుణమన్నారు. అనంతరం సీతారం ఏచూరి, జక్కా వెంకయ్య, నాగూర్‌సాహెబ్, అమీర్‌సాహెబ్‌లకు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు అజయ్‌కుమార్, మూల వెంకయ్య, కాకు వెంకటయ్య, ఎంపీటీసీ విజయమ్మ, కోడె రమణయ్య, కంచర్ల వెంకటేశ్వర్లు, నాయబ్‌రసూల్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : మంత్రి ఆనం



వ్యవసాయ పరికరాలను అందజేస్తున్న మంత్రి ఆనం

ఆత్మకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని, గత వైసీపీ ప్రభుత్వం రైతాంగాన్ని విస్మరించి అనేక సంక్షేమ పథకాలను అమలు చేయలేదని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటిపారుదల పథకం ద్వారా బిందు, తుంపర్ల సేద్య పరికరాలను, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో స్ప్రేయర్లను రైతులకు ఆయన అందజేశారు. రైతులతో ముఖాముఖిగా మాట్లాడి వారు పొందిన వ్యవసాయ పరికరాల విలువ, ప్రభుత్వం చెల్లించిన రాయతీ వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన అప్పులతో ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతుకు మేలు చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వ్యవసాయ రంగానికి కోట్లాది రూపాయలు మంజూరు చేస్తున్నారని, అన్నదాతలు ఈ విషయాన్ని గమనించి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. గత ప్రభుత్వంలో జిల్లాలో వ్యవసాయశాఖ మంత్రి ఉన్నప్పటికీ రైతుల గురించి పట్టించుకోలేదన్నారు. 2022-23లో గత ప్రభుత్వం పామాయిల్ రైతులకు ఇవ్వాల్సిన సబ్సిడీ నగదును కూడా కూటమి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో 214 మంది రైతులకు రూ. 2.55 కోట్ల విలువైన డ్రిప్, స్ప్రింకర్ల పరికరాలను రూ. 1.96 కోట్ల ప్రభుత్వ రాయతీతో పంపిణీ చేయడం జరిగిందన్నారు. గత పదేళ్ల క్రితం ఆత్మకూరులో ఆగిపోయిన అభివృద్ధి మళ్లీ కూటమి ప్రభుత్వంలో మొదలైందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి శ్రీనివాసులు, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సుబ్బారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి సత్యవాణి, ఆర్డీవో బి పావని, ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్, వైస్ చైర్మన్ షేక్ సర్దార్, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, టీడీపీ నేతలు, అధికారులు, రైతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి: సీపీఎం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నేతలు

కావలిటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిత్యావసరాల ధరలు తగ్గించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచులయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని 18వ వార్డు ముస్లిం, గిరిజన కాలనీల్లో నిర్వహించిన ప్రజాపోరులో ఆయన పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి సమస్యలడిగి తెలుసుకున్నారు.

న్యూస్ బాక్స్

డ్రై ఫ్రూట్స్‌తో శివలింగం అలంకరణ

బిట్రగుంట, నవంబరు 10: బోగోలు రైల్వే ఎల్‌సీగేట్ 143 సమీపంలోని కామాక్షి సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో కార్తీక ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటి శ్రవణానక్షత్ర సందర్భంగా స్వామివారి మూలవిరాట్ శివలింగానికి డ్రైఫ్రూట్స్‌తో చేసి అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా భక్తులు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించారు. షిర్డీసాయి మందిరంలో ఆకాశజ్యోతి వెలిగించారు.

శివాలయంలో వనభోజనాలు

అల్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక పేటలోని శివాలయంలో కార్తీక మాసంను పురస్కరించుకొని మండల బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు ఆదివారం వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 60ఏళ్లు నిండిన బ్రాహ్మణ వృద్ధ దంపతులకు పాద పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం వనభోజనాలను చేపట్టారు.

చట్టాలను పటిష్టం చేయాలి

అల్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమాజంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని పటిష్టం చేయాలని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమాజంలో తూకాల్లో తేడాలు, ధరల్లో వ్యత్యాసం, కల్తీల జోరు అధికంగా ఉన్నా సంబంధిత అధికారులు పర్యవేక్షణ కొరవడిందని విమర్శించారు. ఈ సమస్యలతో నిత్యం వినియోగదారుడు నష్టపోతూనే ఉన్నాడని, ఏ దుకాణంలో కూడా రశీదులు ఇవ్వడం లేదన్నారు. పౌర సరఫరాధికారులు స్పందించి చట్టాలను పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు.

బీజేపీ నేతల సంబరాలు

వింజమూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ జాతీయ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి ఆర్టీసీ రీజనల్ చైర్మన్‌గా పదవి రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పాత బస్టాండ్ సెంటర్‌లో బీజేపీ నేతలు టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతాపార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పులిచెర్ల వెంకటనారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు బేగా మధుయాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ముంతా ఉమామహేశ్వరరావు, శీను, రమేష్, ఆర్ఎస్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీలో ఇంటర్నేషనల్ అకౌంటింగ్ డే

ఉలవపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య విభాగ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటర్నేషనల్ అకౌంటింగ్ డే నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జీఎల్ సుధారాణి ప్రకటనలో తెలిపారు. అకౌంట్ అనేది వ్యాపార రంగానికే చెందిగా కాకుండా జీవన విధానంలో వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడానికి అన్వయించుకోవాలని సూచించారు. అకౌంటింగ్ నైపుణ్యాలను పెంచుకుంటే కెరీర్ అవకాశాలను ఎలా అందిపుచ్చుకోవచ్చో వాణిజ్యశాస్త్ర విభాగం ఇన్‌చార్జి ఎస్‌హరిత వివరించారు.

హోమియో వైద్యుడు మోహన్‌రెడ్డి మృతి

కావలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) తేలుకాటుకు హోమియో వైద్యం, పాము కాటుకు నాటు వైద్యం అందించే మోహన్ రెడ్డి (70) ఆదివారం కావలిలో గుండెపోటుతో మృతి చెందారు. సంకలవారితోటకు చెందిన ఈయన కావలి పరిసర ప్రాంతాల ప్రజలకు ఉచితంగా తేలు, పాముకాటు మందును కొన్నేళ్లుగా అందజేశారు. కొన్ని వేల మందికి వైద్యం అందించిన మోహన్‌రెడ్డి మృతి చెందటం విషాదకరం అని వాపోయారు.

హైందవ శంఖారావం కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ధార్మిక సంస్థల బాధ్యులు

కావలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ధార్మికసంస్థలు ఆదివారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో సంఘం బాధ్యులు జనవరి 5న నిర్వహించనున్న హైందవ శంఖారావం కరపత్రాలను ఆవిష్కరించారు. ఆర్ఎస్ఎస్ కార్యకారిణి సభ్యులు యుగంధర్ హైందవ సంఘటిత ఆవశ్యకతను వివరించారు. హిందువులు చైతన్యవంతులై మేల్కొనక పోతే ఆలయాలు వాటి ఆస్తులు కనుమరుగై పోతాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు భరత్, కుట్టుబోయిన బ్రహ్మానందం, అంచిపాకల కమల, ఆర్ఎస్ఎస్ ప్రాంతీయప్రముఖులు టంగుటూరి బాలమురళి, శివప్రసాద్, విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి ఇంటూరు రమణయ్య, గునుపూడి సుబ్బరాయుడు, లక్ష్మీరాజ్యం, విశ్వహిందూ పరిషత్ నగర అధ్యక్షులు వేదగిరి సూర్యనారాయణ చార్యులు, ఉపాధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు



అంకభూపాలపురంలో టీడీపీ సభ్యత్వం చేయిస్తున్న నాయకులు

వలేటివారిపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంకభూపాలపురంలో ఆదివారం టీడీపీ నాయకులు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి ప్రెగడ శ్రీనివాసులు మాట్లాడారు. సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో నేతలు శ్రీనివాసులు, యువ నాయకులు ప్రెగడ మోహన్‌కుమార్, చెంచు శ్రీనివాసులు, బక్కమంతుల ప్రసాద్, సైదులు, సురేష్, లాజరు, అంకయ్య పాల్గొన్నారు.

●కందుకూరు: పట్టణంలోని 24వ వార్డులో ఆదివారం వార్డు అధ్యక్షుడు మదిర మధు ఆధ్వర్యంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండేళ్లపాటు ఐదు లక్షల ప్రమాదబీమా సౌకర్యంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● దుత్తలూరు(ఉదయగిరి రూరల్) : మండలంలోని నందిపాడులో ఆదివారం మాజీ ఎంపీపీ శీకుర్తిల రవీంద్రబాబు ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ సభ్యత్వం అండగా నిలుస్తుందన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల మధు, మాజీ సర్పంచు హజరత్తయ్య, బత్తల నరసింహరావు పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థులు రాణించాలి



క్రీడా, సాంస్కృతిక పోటీలకు తరలివెళుతున్న విద్యార్థులు

ఉదయగిరి రూరల్, నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల విద్యార్థులు సోమవారం నుంచి మూడు రోజుల పాటు తిరుపతిలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలో జరిగే క్రీడా, సాంస్కృతిక పోటీలకు ఎంపిక కావ డం అభినందనీయ మని అసోసియేట్ జి కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ద్వితీయ, తృతీ య సంవత్సరం మొదటి సెమిస్టర్ చదువుతున్న 22మంది విద్యార్థులను పోటీలకు పంపించినట్లు, క్రీడల్లో విద్యార్థులు రాణించాలని కోరారు. అనంతరం ప్రత్యేక వాహనంలో విద్యార్థులు తరలివెళ్లారు. కార్యక్రమంలో అధి కారి టి గోపికృష్ణ, ఎన్ఎస్ఎస్ అధికారి జి రమే ష్, అధ్యాపకులు దర్గాప్రసాద్, రమణ పాల్గొన్నారు.

కాలువ పూడికతీత ప్రారంభం



కాలువ పూడికతీతను ప్రారంభిస్తున్న వంటేరు

జలదంకి, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): కావలి కాలువ పరిధిలోని సోమవరప్పాడు మేజర్‌కాలువ పూడిక తీత పనులకు కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి రూ.2లక్షల సొంత నిధులను వెచ్చిస్తున్నారు. కాలువ ఆయకట్టు పరిధిలోని బ్రాహ్మణక్రాక, సోమవరప్పాడు, క్రిష్ణాపాడు గ్రామాల పొలాలు ఉన్నాయి. పూడికతో నిండిపోవడంతో సోమశిలజలాలు పొలాలకు అందడం లేదని రైతులు వంటేరు దృష్టికి తీసుకొచ్చారు. ఆయన సొంత నిధులతో పూడిక తీత పనులు చేపడతానని హామీ ఇచ్చారు. ఆ మేరకు ఆదివారం భారీ ఎక్స్‌వేటర్‌ను తెప్పించి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మేకల శ్రీనాథ్‌రెడ్డి, జిలుమూడి వినయ్‌రెడ్డి, వేణురెడ్డి, దగుమాటి శ్రీనివాసులరెడ్డి తదితరులు ఉన్నారు.

చప్టాకు మరమ్మతులు చేపట్టాలి

● వాహనదారుల ఆందోళన



గండికట్ల చెరువు వద్ద ధ్వంసమైన చప్టా

కొండాపురం, నవబంరు 10 (ఆంధ్రజ్యోతి): కొమ్మి పంచాయతీ గండికట్ల చెరువు వద్ద ఏర్పాటు చేసిన చప్టా పూర్తిగా ధ్వంసమైంది. 10ఏళ్ల కిందట నిర్మించిన ఈ చప్టా గుంతలు పడటంతో వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కావలి నుండి కొండాపురం వరకు ఈ రహదారిపై నిత్యం వందలాది ద్విచక్రవాహనదారులు, కార్లు, బస్సులు తిరుగుతుంటాయి. పగటిపూట వెళ్లే వాహనదారులకు గుంతలు కనిపెట్టి జాగ్రత్తగా ప్రయాణం చేస్తారు. రాత్రిపూట వేళ్లే వాహనదారులు ఎదురుగావచ్చే వాహన వెలుతురుకు గుంతలు కనిపించక ప్రమాదాలకు గురి అవుతున్నారు. అధికారులు స్పందించి చప్టాకు మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



తోకల మహేష్ (ఫైల్)

కందుకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కందుకూరు- సింగరాయకొండ రోడ్డులోని గాయత్రీ కళాశాల సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని మోపాడు గ్రామానికి చెందిన తోకల మహేష్ (30) దుర్మరణం చెందాడు. కందుకూరు వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న మహేష్ సీటీఆర్ఐ సమీపంలోని చెక్‌పోస్టు వద్ద డ్యూటీ కోసం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న మహేష్ తనముందు వెళ్తున్న ట్రక్కు ఆటోను ఓవర్‌టేక్ చేసి వెళ్లేందుకు కుడివైపుకు రాగా వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు అతన్ని ఢీకొట్టింది. దీంతో అతను రోడ్డుపై పడిపోగా కారు చక్రం అతని తలపైకి ఎక్కినట్లు ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. ప్రమాదానికి కారణమైన కారును అదుపులోకి తీసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా హాస్పటల్‌కు తరలించాడు. మృతుడు మహేష్ కందుకూరు మాజీ ఏఎంసీ చైర్మన్ తోకల కొండయ్య సోదరుని కుమారుడు. కాగా, రోడ్డు ప్రమాదంలో తోకల మహేష్ మృతిచెందాడన్న సమాచారంతో స్వగ్రామం మోపాడులో తీవ్ర విషాదఛాయలు నెలకొన్నాయి. మహేష్‌కు భార్య, రెండేళ్ల పాప, ఆరునెలల బాబు ఉన్నారు.

ఘనంగా అటవీ అమరవీరుల సంస్మరణ దినం



నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది

ఉదయగిరి రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక అటవీశాఖ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అటవీ క్షేత్రాధికారి బీఎస్ కుమార్‌రాజా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు పాల్గొని అమరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి కె మురళి, కె వెంకటప్రసాద్, ఫారెస్ట్ సెక్షన్ అధికారి శ్రీరాములు, చిన్న వెంకటయ్య పాల్గొన్నారు.

టాటా ఏసీ ఆటో, మోటారు బైక్ ఢీ

● మామ, కోడలికి గాయాలు

కావలి రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రంక్‌రోడ్డులో రోడ్డు క్రాస్ అవుతుండగా ఆదివారం టాటా ఏసీ ఆటో, మోటారు బైక్ ఢీ కొన్న సంఘటనలో ఇస్లాంపేటకు చెందిన అక్షయకు గాయాలయ్యాయి. ఆమె మామతో కలిసి షాపింగ్ చేసుకుని మోటారు బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరుతుండగా ఒంగోలు వైపు నుండి పట్టణంలోకి వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమెకు రక్తగాయాలయ్యాయి. కోడలిని 108 వాహనంలో మామ ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కార్తీక దీపం విశిష్టతను తెలుసుకోండి



కార్తీక దీపం విశిష్టత గురించి చెబుతున్న ప్రబోధసేవా సమితి అధ్యక్షుడు ప్రసాద్

లింగసముద్రం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక దీపం విశిష్టతను తెలుసుకోవాలని త్రైత సిద్ధాంత-ప్రబోధ సేవాసమితి దుత్తలూరు అధ్యక్షులు ప్రసాద్ అన్నారు. ఆదివారం లింగసముద్రంలో ఆయన సమితి సభ్యులతో కలిసి కార్తీకదీపం విశిష్టత, అంతరార్థం గురించి, భగవద్గీత జ్ఞాన ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు పెంచలరత్నం, నరసింహులు, నాగమ్మ, రమణయ్య, రమణమ్మ, ప్రేమ్‌కుమార్, మధుప్రియ, మాల కొండారెడ్డి, మమత పాల్గొన్నారు.

శిథిలావస్థలో పంచాయతీ కార్యాలయం



లింగసముద్రం పంచాయతీ కార్యాలయం

లింగసముద్రం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యాలయం స్లాబు పైకప్పు శిథిలావస్థకు చేరింది. వర్షం వచ్చినపుడు వాననీరు ఉరుస్తోందని ఈ సమస్యతో సర్పంచు, కార్యదర్శి, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. అలాగే కార్యాలయ రికార్డులు, కంప్యూటరు, ఇతర సామగ్రి తడిచిపోతున్నాయని వాపోతున్నారు. 1995లో నిర్మించిన ఈ భవనానికి కనీసం మరమ్మతులు కూడా చేపట్టక పోవడంతో ఈ సమస్య నెలకొందని చెబుతున్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

ఉలవపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న బియ్యం ఆటోను ఆదివారం ఉదయం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. బియ్యంను ఉలవపాడుకు తరలిస్తున్నారనే సమాచారం మేరకు పట్టుకునేందుకు వెళ్లగా డ్రైవర్ ఆటోను వదిలి పారిపోయాడని పట్టుబడిన బియ్యానికి సంబంధించిన సమాచారాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీకి అందజేసినట్లు ఎస్ఐ అంకమ్మ తెలిపారు.

ట్రంకురోడ్డులా పొదలకూరు రోడ్డు

● రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి
● డివైడర్ పనులకు శంకుస్థాపన

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని పొదలకూరురోడ్డును రానున్న రోజుల్లో ట్రంకురోడ్డు మాదిరిగా అభివృద్ధి చేస్తానని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బట్వాడిపాళెం సెంటర్‌లో ఆదివారం రూ.1.5కోట్ల నిధులతో పొదలకూరు రోడ్డు డివైడర్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రోడ్ల మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టారని, రూరల్ నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు. రెండు నెలల్లో డివైడర్ పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, పిండి సురేష్, ఊరందూరు సురేంద్రబాబు, అబ్దుల్ రసూల్, ఆనంద్, శేఖర్, శరత్ చంద్ర, బాబీ తదితరులు పాల్గొన్నారు.


టెంకాయ కొట్టి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆధునిక పద్ధతుల్లో ప్లాస్టిక్ సర్జరీ : డాక్టర్ ఏవీ రెడ్డి

నెల్లూరు(విద్య), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పెరిగిన సాంకేతికత ఆధారంగా ఆధునిక పద్ధతుల్లో నేడు ప్లాస్టిక్ సర్జరీ చేయించుకోవచ్చని ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ ఏవీ రెడ్డి తెలిపారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్లాస్టిక్ సర్జరీపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ సుశ్రుతుడు ప్రారంభించిన ఈ ప్లాస్టిక్ సర్జరీ విధానంలో ఇప్పటివరకు ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. కాస్మెటిక్ సర్జరీ అనేది వ్యక్తి రూపాన్ని మెరుగుపరచడమేకాక వృద్ధాప్య సంకేతాలను తొలగిస్తుందని చెప్పారు. అనంతరం వాకర్స్ సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ సుబ్బరాజు, కార్యదర్శి స్వర్ణ రమేష్ బాబు, నాయకులు చింతల అమరేంద్రరెడ్డి, పొన్నం రవిచంద్ర, రాఘవేంద్రషెట్టి, డాక్టర్ అంకిరెడ్డి, డాక్టర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నారాయణ... నారాయణ!



● ఆలనాపాలనా కరువైన దంపూరు ఆదినారాయణ ఆలయం ● శతాబ్దం నాటి గుడి
● 6 ఎకరాల మాన్యం.. ఏటా రూ.2లక్షల కౌలు.. అయినా ధూపదీప నైవేద్యం కరువు
● పట్టించుకోని దేవదాయశాఖ అధికారులు ● భక్తులు, గ్రామస్థుల ఆగ్రహం

విడవలూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని దంపూరులో ఉన్న ఆదినారాయణ స్వామి ఆలయం ధూపదీప నైవేద్యాలకు నోచుకోవడం లేదు. స్వామివారికి ఏటా రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా ఆలయంలో మాత్రం ఎలాంటి అభివృద్ధి జరగడం లేదు. దేవదాయశాఖ అధికారుల నిర్లక్ష్యంపై భక్తులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● వందేళ్లనాటి ఆలయం

దంపూరులోని ఆదినారాయణ స్వామి ఆలయాన్ని వందేళ్ల క్రితం కట్టించారు. భక్తుల కోర్కెలను తీర్చే దేవాలయంగా ఇది ప్రసిద్ధి చెందింది. గ్రామానికి చెందిన దంపూరు మోహన్‌రావు సొంత నిధులతో ఆలయానికి ప్రహరీగోడ, గేట్లు నిర్మించారు. ఈ ఆలయానికి సుమారు 6.24 ఎకరాల భూమి ఉంది. దాని ద్వారా ఏటా రూ.2లక్ష లు కౌలు వస్తోంది. అయినా దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆలయ పర్యవేక్షణ అటకెక్కింది. స్వామి, అమ్మవార్లకి ధూపదీప నైవేద్యం కూడా సమర్పించడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దేవాలయ ఆవరణంలో గడ్డి పెరిగి పాములు తిరుగుతున్నాయని, గోపురంపై చెట్లు మొలిచినా అధికారులు పట్టించుకోలేని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భక్తుల భద్రత కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయడం లేదు. పండుగ రోజులు, కార్తీక మాసంలో పూజలు చేయడానికి వస్తే ఆలయ తలుపులకు తాళాలు వేసి ఉంటున్నాయని భక్తులు ఆవేదన చెందుతున్నారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు



ఈ ఆలయానికి ఎంతో చరిత్ర ఉంది. దాని నిర్వహణ పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకుని పోతా. ఆమె ఆదేశాలతో తదుపరి కార్యాచరణ ఉంటుంది.

- దూది విజయరాఘవన్, టీడీపీ నాయకుడు

సొంత నిధులతో శుభ్రం



ఆలయ భూములకు ప్రతి సంవత్సరం రూ.లక్షల్లో కౌలు వస్తున్నా అధికారులు ఏమీ పట్టించుకోలేదు. దేవాలయ ప్రాంగణం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే నా సొంత ఖర్చులతో శుభ్రం చేయిస్తున్నాను.

- మావిళ్ల రమేష్, భక్తుడు

విచారణ జరుపుతాం

దంపూరులో వెలసిన ఆదినారాయణ స్వామివారికి ధూపదీప నైవేద్యాలు పెట్టడం లేదన్న విషయం నా దృష్టికి రాలేదు. ఈ ఆలయ పూజారి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో కొంత కాలంగా ఒక్కడి కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను మరో పూజారికి అప్పగించాడని తెలిసింది. దీనికి సంబంధించిన ఎలాంటి విషయం ఎవరూ తన దృష్టికి తీసుకురాలేదు. అయినా ఈ విషయంపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటాం.

- రామకృష్ణ, ఆలయ ఈవో

న్యూస్ బాక్స్

రేపు శ్రీనివాసుడి నగరోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీనివాసుని నగరోత్సవం మంగళవారం రాత్రి నిర్వహిస్తున్నట్లు సింహపురి గోవింద మాల కమిటీ, శ్రీకనకదుర్గా సేవా సమితి భక్త బృందం ఓ ప్రకటనలో పేర్కొంది. కార్తీక మాసం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవంలో హంస వాహనంపై శ్రీనివాసస్వామి సరస్వతీ అలంకారంలో ఊరేగుతారని తెలిపింది.

నేడు భవానీశంకరాలయ వార్షికోత్సవం

నగరంలో మహాత్మాగాంధీ నగర్‌లోని కృష్ణమందిరంలో ఉన్న భవానీశంకర ఆలయ విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం, కార్తీక మాసం రెండవ సోమవారం వేడుకలు జరుగుతాయని ఆలయ అర్చకుడు శ్రీనివాసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మైనారిటీ నేతల సంబరాలు

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా పోలంరెడ్డి దినేష్‌రెడ్డి నియమితులు కావడంతో బుచ్చిరెడ్డిపాళెం ఖాజానగర్‌లో ఆదివారం రాత్రి టీడీపీ మైనారిటీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. నాయకులు షేక్ షబ్బీర్, సుబానీ, రియాజ్, షబీర్, ఖాదర్‌బాషా, తిరుపాలు, ఉస్మాన్, రహమత్‌బాషా, దత్తు, షఫీ, యువత పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెంలో శనివారం అర్ధరాత్రి ఓ ఇసుకల లారీని బుచ్చి ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి పట్టుకున్నారు. సంగం నుంచి ఒంగోలుకు బిల్లులు లేకుండా అక్రమంగా ఇసుక లోడుతో వెళ్తున్న టర్బో లారీని పోలీసులు దాడులు చేసి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఎలాంటి అనుమతులు లేకపోవడంతో స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాకాణి జన్మదిన వేడుకలు

పొదలకూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం నరసారెడ్డి కాలనీలోని వృద్ధుల ఆశ్రమంలో నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తెనాలి నిర్మల, ఉప సర్పంచు వాకాటి శ్రీనివాసులురెడ్డి, వార్డు సభ్యులు షేక్.అంజాద్, బసవనూరు హరి, నాయకులు గంగవరపు వేణుగోపాల్‌రెడ్డి, ఆకులూరు హేమంత్, పడారు బాలకృష్ణ, షేక్.గౌస్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఆనంకు ధన్యవాదాలు

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : అర్చకులకు వేతనాలు పెంచినందుకు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి జిల్లా అర్చక సమాఖ్య నాయకులు ధన్యవాదాలు తెలిపారు. మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్ ఆధ్వర్యంలో అర్చక సమాఖ్య నాయకు లు యూ.వేంకటశేషాచార్యులు, జీ ఫణికుమార్, వీ శ్రీనివాసులు మంత్రిని కలిశారు.

కోవూరును ఆగ్రగామిగా నిలపాలి

నిడవలూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో కోవూరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆగ్రగామిగా నిలపాలని మండల టీడీపీ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, అడపాల శ్రీధర్‌రెడ్డిలు కోరారు. కోవూరు ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నాయకత్వంలో ఈనెల 1వ తేదీన నియోజవర్గంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టామని, ఇప్పటి వరకు 15వేల సభ్యత్వాలు నమోదు చేశామన్నారు. పార్టీని నమ్ముకున్నవారికి సీఎం చంద్రబాబునాయుడు, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అండగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత గోపిరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వంశీకృష్ణారెడ్డి

కంటైనర్ టెర్మినల్ సాధన కోసం ఉద్యమం

ముత్తుకూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ సాధనకై తక్షణమే ఉద్యమించాలని సీపీఎం జిల్లా నాయకుడు ఎం.మోహన్‌రావు పిలుపునిచ్చారు. సీపీఎం మండల 6వ మహాసభ ముత్తుకూరు గ్రామిక భవనంలో ఆదివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా 14న తహసీల్దారు కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనాలని కోరారు. అనంతరం మండల కార్యదర్శిగా గడ్డం అంకయ్య, 8 మంది సభ్యుల ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోగుల శ్రీనివాసులు, నాయకులు నక్క రాధయ్య, శ్యాంప్రసాద్, మోహన్‌రావు, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.


మహాసభలో పాల్గొన్న సీపీఎం నాయకులు

లాభసాటి వ్యవసాయమే పొలం పిలుస్తోంది లక్ష్యం

● పొదలకూరు ఏడీఏ శివనాయక్

పొదలకూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : రైతులకు ఆధునిక వ్యవసాయ విధానాలు, సస్యరక్షణ చర్యలు, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని వ్యవసాయ శాఖ పొదలకూరు సహాయ సంచాలకుడు శివనాయక్ తెలిపారు. అధిక దిగుబడులు, సేంద్రియ వ్యవసాయంతో లాభాలు, ఇష్టానుసారంగా రసాయనిక ఎరువుల వినియోగంపై నష్టాలను రైతులు అవగాహన పొందుకోవాలన్నారు.



? పొదలకూరు సబ్ డివిజన్ పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం ఎలా జరుగుతోంది.

! సబ్ డివిజన్ పరిధిలోని పొదలకూరు, చేజర్ల, కలువాయి, మనుబోలు, రాపూరు మండలాల్లో సెప్టెంబరు 24న ప్రారంభమైన పొలం పిలుస్తోంది కార్యక్రమం ఒక విడత అన్ని పంచాయతీల్లో సక్సెస్‌ఫుల్‌గా పూర్తయింది.

? రైతులతో మమేకం ఎలా ఉంది.

! వ్యవసాయ, అనుబంధ సంఘాలు, సిబ్బంది రైతులతో తక్కువ కాలంలోనే మమేకమవుతూ సాంకేతిక సేవలు అందిస్తున్నాం. సాగు ఖర్చులు తగ్గించి నాణ్యమైన దిగుబడే లక్ష్యంగా నూతన విధానాలను రైతులకు అందిస్తున్నాం.

? పీఎం ఫసల్ బీమా గడువు ఎప్పటి వరకు ఉంది.

! రైతులు డిసెంబరు 31లోగా హెక్టార్‌కు రూ.420 ప్రీమియం బ్యాంకుల్లో చెల్లించి పీఎం ఫసల్ బీమా యోజన పథకం కింద నమోదు చేసుకోవాలి.

? రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు ఎలాంటి సేవలు అందుతున్నాయి.

! డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు ఆర్‌ఎస్‌కేల ద్వారా అందజేస్తున్నాం. రైతులకు వరి విత్తనాలను రాయితీపై పంపిణీ చేస్తున్నాం.

? మండలంలో ఈ ఏడాది ఎన్ని వేల ఎకరాల్లో వరి సాగు చేయవచ్చు.

! గత ఏడాది కంటే ఈ ఏడాది చెరువులు, కాలువల ద్వారా నీరు పుష్కలంగా ఉన్నందున గత ఏడాది కంటే వెయ్యి నుంచి 1500 ఎకరాలు అధికంగా రైతులు సాగు చేయనున్నారు. దీంతో 13,500 ఎకరాల్లో వరి సాగు అయ్యే అవకాశం ఉంది.

ట్యాంక్‌బండ్ తరహాలో నెక్లెస్ రోడ్డు అభివృద్ధి

● నుడా చైర్మన్‌గా ఎంపికైన కోటంరెడ్డి

నెల్లూరు(వైద్యం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ తరహాలో నెల్లూరు నగరంలోని నెక్లెస్ రోడ్డును అభివృద్ధి చేస్తామని నుడా చైర్మన్ ఎంపికైన కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి వెల్లడించారు. ఆదివారం నగరంలోని తారక రామారావు పార్క్ వద్ద ఉన్న ఎన్టీఆర్ దంపతుల విగ్రహాలకు ఆయన నివాళులర్పించారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో తాను నుడా చైర్మన్‌గా ఉన్నప్పుడు నెక్లెస్ రోడ్డు, ఘాట్ నిర్మించామని, అసం పూర్తి నిర్మాణాలను ఇప్పుడు పూర్తి చేస్తామని చెప్పారు. తనకు మరోసారి నుడా చైర్మన్‌గా అవకాశం ఇచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, హిందూపురం ఎమ్మెల్యే, సినీ హీరో బాలయ్య బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఎన్టీఆర్ నెక్లెస్ రోడ్‌ను మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సహకారంతో చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి చేస్తామన్నారు. నగరంలో పార్కులను అభివృద్ధి చేసి వాటికి ఎన్టీఆర్ పేరే పెడతామని చెప్పారు. ఐ లవ్ నెల్లూరు అన్న బోర్డులను అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసి చెత్త రహితంగా నగరాన్ని తీర్చిదిద్దుతామన్నారు. నుడా పరిధిలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, పిట్టి సత్యనాగేశ్వరరావు, కప్పిర శ్రీనివాసులు, మొయినుద్దీన్, అంచూరి శ్రీనివాసులు నాయుడు, కువ్వారపు బాలాజీ, పెంచల చౌదరి, నాని, సుధా తదితరులు పాల్గొన్నారు. కాగా, టీడీపీ నేతలు కిన్నెర ప్రసాద్, వైవీ గురు ఆధ్వర్యంలో నాయకులు కోటంరెడ్డిని ఆయన నివాసంలో గజమాలతో సత్కరించారు. అభిమానులు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని కోటంరెడ్డి హామీ ఇచ్చారు.


ఎన్టీఆర్ దంపతుల విగ్రహాల వద్ద కోటంరెడ్డి, టీడీపీ నాయకులు

నేరాలకు పాల్పడితే చర్యలు

కోవూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎవరైనా నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రంగనాథ్‌గౌడ్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని పలువురు రౌడీషీటర్లకు స్థానిక పోలీసు స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. నేరాలకు పాల్పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. సామాజిక మాధ్యమాల్లో మహిళలు, విద్యార్థినులపై అసభ్యకర పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


మాట్లాడుతున్న ఎస్‌ఐ రంగనాథ్‌గౌడ్

ఏవీఆర్‌కు మంత్రి ఆనం అభినందనలు


వెంకటరమణారెడ్డిని సత్కరిస్తున్న మంత్రి ఆనం

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా నియమితులైన ఆనం వెంకట రమణారెడ్డి(ఏవీఆర్)ని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అభినందించారు. ఆదివారం నెల్లూరులో మంత్రిని ఆనం వెంకటరమణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి వెంకటరమణారెడ్డిని శాలువాతో సత్కరించారు.

మంత్రి నారాయణను కలిసిన సురేష్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ బోర్డు చైర్మన్‌గా నియమితులైన బీజేపీ నాయకుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ఆదివారం నగ రంలోని గోమతి నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో మంత్రి పీ.నారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్‌గా నియమితులైనందుకు సురేష్‌రెడ్డిని మంత్రి అభినందించారు.

సన్నపురెడ్డి, వేమిరెడ్డిలకు అభినందన

ఇందుకూరుపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌ఆర్టీసీ నెల్లూరు రీజియన్ చైర్మన్‌గా నియమితులైన బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిని ఆదివారం నెల్లూరులోని ఆయన నివాసంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కైలాసం శ్రీనివాసరెడ్డి కలసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే టీటీడీ బోర్డు సభ్యురాలిగా నియమితులైన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని నెల్లూరులోని ఆమె నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. నాయకులు జనార్దన్‌రెడ్డి, సీహెచ్.గాంధీ, దువ్వూరు రాంమోహన్‌రెడ్డి, లేబూరు సతీష్‌రెడ్డి, చిల్లకూరు సుదీప్‌రెడ్డి, పామంజి కిషోర్, దొంతాల మహేష్, నెల్లూరు వెంకటశేషయ్య, నెల్లూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాల్యం కథల నుంచే సాహిత్యం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలో సాహిత్యం ఎదిగిందంటే అందుకు ప్రధాన కారణం బాల్యం కథలేనని ప్రముఖ కథా రచయిత, పాత్రికేయుడు మహమ్మద్ ఖదీర్‌బాబు తెలిపారు. ఆదివారం టౌనుహాలు వర్తమాన సమాజంలో వంజారి రోహిణి రచించిన విజయమహల్ గేటు కథల సంపుటిని ఆయన ఆవిష్కరణ చేశారు. అనం తరం ఆయన మాట్లాడుతూ ఆంగ్ల సాహిత్యంలో బాల్యం కథలు రాయని రచయితలులేరన్నారు. నెల్లూరు జిల్లా తొలినాళ్ల నుంచి పద్యం, కవిత, కథ, నాటకం, సినిమా ఇలా అన్ని ప్రక్రియల్లో అగ్రభాగాన ఉండేదన్నారు. ప్రస్తుతం ఆ వైభవం తగ్గిందని విచారం వ్యక్తం చేశారు. యువతలో సాహిత్యం పై అభిరుచి పెరిగేలా రచయితలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అమరారెడ్డి కృష్ణారెడ్డి హాజరయ్యారు. లతీఫ్‌కుట్టి, ఎంఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని రచయిత ఈతకోట సుబ్బారావు నిర్వహించారు.


ఖదీర్‌బాబుకు సన్మానం

ఘనంగా 'కేతా' శత జయంతి

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పురమందిరంలో ఆదివారం కేతా అంకులు శత జయంతి వేడుకలు జరిగాయి. కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సినిమా పాటలు, శాస్త్రీయ నృత్య పోటీలు నిర్వహించారు. విజేతలకు అవార్డులు ప్రదానం జరిగింది. వాకాటి విజయకుమార్‌రెడ్డి పాల్గొనగా కేతా సుబ్బారావు పర్యవేక్షించారు.

కాపు భవనం మరింత అభివృద్ధి

● కార్తీక వనభోజనాల్లో మంత్రి పొంగూరు నారాయణ

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కాపు భవనాన్ని రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని రాష్ట్ర మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ హామీ ఇచ్చారు. కాపు భవన్‌లో కాప్స్ రాక్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వన భోజన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా మంత్రి నారాయణ, రమాదేవి దంపతులు హాజరయ్యారు. శివలింగానికి అభిషేకాలు చేశారు. ఆ భవనం వద్ద ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయులు విగ్రహాన్ని ఆవిష్కరించారు. మంత్రి దంపతులను కాపు నేతలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాప్స్ రాక్స్ ప్రతినిధులు గాదిరాజు అశోక్‌కుమార్, పిండి సురేష్, బొట్టు బాబు, పసుమర్తి కిషోర్, గునుకుల కిషోర్, బావిశెట్టి కిషోర్, భూపతి రాఘవ పాల్గొన్నారు.


శ్రీకృష్ణదేవరాయులు విగ్రహావిష్కరణలో మంత్రి నారాయణ

● నెల్లూరు(విద్య/ఆంధ్రజ్యోతి) : కాపు భవన్‌లో జరిగిన వనభోజనాల సందర్భంగా డాక్టర్ కేర్ హోమియోపతి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. మంత్రి దంపతులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పెద్దిరెడ్డి శివ భాస్కర్, డాక్టర్ మధుసూదన్, విజయకృష్ణ, భారతి, దివ్య, మేనేజర్ బాబు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప గ్రామోత్సవం

పొదలకూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం అయ్యప్పస్వామి గ్రామోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో స్వామికి శ్రీధర్మశాస్త్ర ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించి ట్రాక్టర్‌పై ఉంచి పట్టణంలోని వీధుల్లో ఊరేగించారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మధ్యాహ్నం ఆలయంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి సభ్యులు, గురుస్వాములు, బ్రహ్మదేవి రాజశేఖర్, కాసా శ్రీనివాసులు, అల్లూరు రమణయ్య ఆచారి, వాకా సుబ్రహ్మణ్యం, గోళ్ల రమణయ్య, శివాడ పరంధామిరెడ్డి, భక్తులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నీటమునిగి ముగ్గురు విద్యార్థుల మృతి

● మృతుల్లో ఒకరు నెల్లూరు జిల్లా వాసి

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కావేరి నదిలో స్నానాలకు వెళ్లిన ముగ్గురు విద్యార్థులు నీటమునిగి మృతిచెందారు. నామక్కల్ జిల్లా పరమత్తివేలూరు సమీపం నగపాళం ప్రాంతానికి చెందిన చిన్నరాజ్ కుమారుడు వినీత్ విమల్‌రాజ్ (21) ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. అదే కళాశాల ధర్మపురి జిల్లా పాపిరెట్టిపట్టి ప్రాంతానికి చెందిన చెందిన నందకుమార్ (21), నెల్లూరు జిల్లాకు చెందిన షేక్ ఫైజుల్ రహమాన్ (21) చదువుతుండగా, వీరు ముగ్గురూ కళాశాల హాస్టల్‌లో ఉంటున్నారు. వీరు శనివారం వినీత్ విమల్‌రాజ్ ఇంటికి వచ్చారు. మధ్యాహ్నం భోజనానంతరం, విమల్‌రాజ్ స్నేహితులతో కలసి కావేరి నదిలో స్నానానికి వెళ్లాడు. వారు చాలాసేపటి వరకు రాకపోవడంతో అనుమానించిన విమల్‌రాజ్ కుటుంబ సభ్యులు కావేరి నది ప్రాంతానికి వెళ్లారు. నది తీరంలో చెప్పులు, సెల్‌ఫోన్లు ఉండడాన్ని గమనించి దిగ్భ్రాంతి చెంది జడర్‌పాళయం పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బందితో అక్కడకు చేరుకున్న పోలీసులు నదిలో గాలించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం కొంత దూరంలో బండరాళ్ల మధ్య చిక్కుకున్న విమల్‌రాజ్ మృతదేహాన్ని అగ్నిమాపక సిబ్బంది గుర్తించారు. మరో రెండు గంటలు గాలించి మిగిలిన ఇద్దరి మృతదేహాలు వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

కాలువల్లో పూడికతీత

మనుబోలు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గురివిందపూడి, మడమనూరు గ్రామాల్లో సాగునీరు పారే పంటకాలువల్లో ఆదివారం పూడికతీత పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గురివిందపూడిలో టీడీపీ నేత చెన్నూరు సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ కాలువల్లో గుర్రపుడెక్క పేరుకుపోయి సాగునీరు పారుదలకు ఇబ్బందిగా ఉండగా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన పూడికతీత పనులు చేయించాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలిచ్చారన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు సర్వేపల్లి శివకుమార్‌శర్మ, అన్నారెడ్డి సుబ్బారెడ్డి, పోలంరెడ్డి రమణారెడ్డి, మోమిడి ప్రసాద్, పుల్లయ్య, మత్తయ్య, చిన్నయ్యలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం - 9985411424

ప్రకటన

నా క్లయింట్ అయిన **దామవరపు వనమ్మ భర్త రామచంద్రయ్య**, 27-10-402, రాయపుపాళెం, స్టోన్‌హౌస్‌పేట, నెల్లూరు సిటీ అనువారు ఇచ్చిన వివరముల మేరకు బహిరంగముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా:- నా క్లయింట్ భర్త గారైన **దామవరపు రామచంద్రయ్య** గారు నెల్లూరు బిట్-2 గ్రామం సర్వే నెం.645లో య. 1-25 సెంట్లు భూమిని **1. నాశం వెంకటరత్నం గారి భార్య 1. రమణమ్మ** మరియు ఈమె కుమార్తె **2. సుశీలదేవి గార్ల** వద్ద నుండి **రిజిష్టర్డు విక్రయపత్రం తేది:24-06-1970 డాక్యుమెంటు నెం.1178/1970** (SRO, Nellore) ద్వారా కొనుగోలు చేసినారు. మరియు మరియొక ఆస్తి అనగా నెల్లూరు బిట్-2 గ్రామంలోని సర్వే నెం.645లో య. 1-25 సెంట్లు భూమిని **నాశం వెంకట క్రిష్ణయ్య గారి భార్య మునిలక్ష్మీ గారి** వద్ద నుండి **రిజిష్టర్డు విక్రయపత్రం తేది:05-10-1970 డాక్యుమెంటు నెం.2194/1970** (SRO, Nellore) ద్వారా కొనుగోలు చేసినారు. నా క్లయింట్ పై తెలిపిన ఒరిజినల్ డాక్యుమెంట్లను జెరాక్స్ తీసుకొను నిమిత్తం తే.02-11-2024దిన తన నివాసం నుండి స్టోన్‌హౌస్‌పేట సెంటర్‌లో ఆటో దిగి జెరాక్స్ షాపునకు పోవుచుండగా మార్గమధ్యములో పోయినవి. సదరు **ఒరిజినల్ డాక్యుమెంట్లు నెం.1178/1970 మరియు నెం.2194/1970 లు** ఎవ్వరికైనను దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సుకు తెచ్చి ఇచ్చిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును. సదరు ఒరిజినల్ డాక్యుమెంట్లను ఉపయోగించి ఎవ్వరైనా ఎట్టి లావాదేవీలు జరిపిన అవి చెల్లనేరవు. అవి నా క్లయింట్‌ను బద్ధగించవు.

జి.వి.యల్.నాగమణి, B.A., B.L.,
అడ్వకేట్, పన్నుప్లీడర్, 25-1-672, జెడ్.పి.కాలని, పొదలకూరు రోడ్డు, నెల్లూరు. సెల్: 944171 5096

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



కిక్కిరిసిన ముక్కంటి ఆలయం

శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. వారాంతపు సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 30 వేలమంది దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 3,433మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,879మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,724మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,092, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 319మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 260మంది, రూ.5వేల టిక్కెట్ల ద్వారా 69మంది భక్తులు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 21,167 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

వయనాడ్ ఎన్నికల బరిలో తిరుపతి జిల్లావాసి



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న డాక్టరు నాగేశ్వర రావు

ఇంతకాలం ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రాతినిధ్యం వహించిన కేరళ రాష్ట్రం వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికల్లో చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండకు చెందిన డాకర్ దుగ్గిరాల నాగేశ్వరరావు పోటీ చేస్తున్నారు.రాహుల్‌గాంధీ రాజీనామా నేపథ్యంలో ఆయన సోదరి ప్రియాంకగాంధీ ఇక్కడ కాంగ్రెస్ తరపున బరిలో వున్న విషయం తెలిసిందే.ఇక్కడ పోటీ చేస్తున్న 16 మంది అభ్యర్థుల్లో ఇండిపెండెంట్ అభ్యర్థి ఆర్. రాజన్ తప్ప మిగతా వారంతా స్థానికేతరులు కావడం విశేషం. పోటీ చేస్తున్న ఇద్దరు తెలుగు వారిలో ఒకరైన డాక్టర్ నాగేశ్వరరావు ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఈయన జాతీయ జనసేన పార్టీ తరపున పోటీ చేస్తున్నారు.

- ఎర్రావారిపాలెం, ఆంధ్రజ్యోతి

యూట్యూబ్‌లో చూసి దొంగ నోట్లు ముద్రించి

- పుత్తూరులో పట్టుబడిన నిందితులు
- నిందితుల్లో ఒకరు శ్రీకాకుళం జిల్లావాసి
- కారు, వస్తువుల సహా నోట్లు స్వాధీనం



నిందితులను చూపుతున్న పోలీసులు



నకిలీ కరెన్సీకి వాడిన వస్తువులు

పుత్తూరు టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): 'నకిలీ నోట్లు ఎలా ముద్రించాలి?' అనేది యూట్యూబ్‌లో చూశారు. ఆ ప్రకారం వస్తువులు తీసుకొచ్చి ముద్రణ చేపట్టారు. వీటిని చెలామణి చేసే క్రమంలో పట్టుబడ్డారు. నిందితులను తిరుపతి జిల్లా పుత్తూరు పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను పుత్తూరు డీఎస్పీ రవికుమార్ ఆదివారం సాయంత్రం మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన మునికృష్ణారావుకు ఫేస్‌బుక్ ద్వారా తిరుపతిలోని రమేష్‌తో పరిచయం ఏర్పడింది. వీరిద్దరూ కలిసి రమేష్ ఇంట్లో షేర్ మార్కెట్ బిజినెస్ చేసేవారు. ఇందులో నష్టాలు వచ్చాయి. దీంతో డబ్బు సంపాదనకు అడ్డమార్గం ఎన్నుకున్నారు. కరెన్సీ నోట్లను ముద్రించే విధానాన్ని యూట్యూబ్‌లో తెలుసుకున్నారు. దీనికి రమేష్ భార్య సంధ్య, కుమార్తె ఇషా తోడయ్యారు. వీరు నలుగురు తిరుపతిలోనే నోట్ల ముద్రణకు కావాల్సిన వస్తువులను కొని ఇంట్లోనే ముద్రించేవారు. ఆ దొంగ నోట్లతో శ్రీకాళహస్తి, తిరుపతి, రేణిగుంట, పుత్తూరులో వస్తువులను కొనుగోలు చేస్తూ మార్చేవారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం రమేష్, ఇషా పుత్తూరు పట్టణం మండివీధిలోని నిర్మల ప్రొవిజన్ స్టోర్, జగన్నాథం ప్రొవిజన్ స్టోర్, శ్రీకృష్ణ స్టోర్స్, శంకర్ దుకాణాలు వంటి పలు దుకాణాల్లో తమ వద్ద నున్న రూ.500 నోట్లతో పలు వస్తువులను కొనుగోలు చేశారు. వారిచ్చిన నోట్లను ఒక దుకాణాదారుడు కరెన్సీ యంత్రంలో లెక్కించగా అది దొంగ నోట్లుగా గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పుత్తూరు సీఐ సురేంద్ర నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది ఆ దుకాణం వద్దకు వెళ్లి సీసీ కెమెరా ద్వారా దొంగనోట్లను ఇచ్చిన వారిని గుర్తించారు.వీరు మరో దుకాణంలో వస్తువులు కొనుగోలు చేస్తుండగా అదుపులోకి తీసుకుని విచారించారు. తిరుపతి, చెర్లోపల్లె సర్కిల్‌లో ఒక ఇంట్లో నోట్లను ముద్రిస్తున్నట్లు చెప్పడంతో, పోలీసులు ఆ ఇంట్లో సోదాలు నిర్వహించారు. నోట్ల ముద్రణకు కావాల్సి వస్తువులు, ప్రింటర్లు, ల్యామినేషన్ యంత్రం, స్క్రీన్ ప్రింటింగ్, కలర్ లిక్విడ్స్ కట్ చేయడానికి సిద్ధంగా ఉన్న 192 రూ.వంద నోట్ల షీట్లు, 156 రూ.ఐదువందల నోట్ల షీట్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ మీడియా సమావేశంలో ఎస్ఐ ఓబులయ్య, పోలీసులు పాల్గొన్నారు.

గురుకులంలో 5వ తరగతి విద్యార్థి ఆత్మహత్య

ఏం కష్టమొచ్చిందో?



విలపిస్తున్న తల్లి రెడ్డి వాణి, (ఇన్‌సెట్‌లో) రెడ్డి మోక్షిత్ మృతదేహం

ఆ చిన్నారికి ఏం కష్టమొచ్చిందో పాపం.. డార్మిటరీలోని ఐటర్‌కాట్‌కు టవల్‌ను బిగించి ఉరేసుకుని చనిపోయాడు. అంతవరకు తమతో పాటే వంట పనుల్లో సాయం చేసిన ఆ చిన్నారి.. విగతజీవిగా మారిపోవడంతో సహచర విద్యార్థులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గ్యారంపల్లెలో గురుకులంలో 5వ తరగతి చదువుతున్న తిరుపతి జిల్లాకు చెందిన రెడ్డిమోక్షిత్ మృతి కలకలం రేపింది.

పీలేరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేవీపల్లె మండలం గ్యారంపల్లెలోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ (బాలుర గురుకులం)లో 5వ తరగతి చదువుతున్న డి.రెడ్డి మోక్షిత్(10) ఆదివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఇతడు తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లులోని దిగువవీధికి చెందిన డి.కృష్ణమూర్తి, డి.వాణి దంపతుల కుమారుడు. రోజులాగే ఆదివారం కూడా ఉదయాన్నే నిద్రలేచిన ఇతడు సహచర విద్యార్థులతో కలిసి కాసేపు పాఠశాల హాస్టల్‌లో వంట పనుల్లో సాయం అందించాడు. ఒక్కసారిగా డార్మిటరీలోకి వెళ్లి తన టవల్‌తో ఐరన్ కాట్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనను గుర్తించిన ఇతర విద్యార్థులు వెంటనే ఉపాధ్యాయులకు తెలియజేశారు. వారు హుటాహుటిన పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తేల్చారు. ఆస్పత్రిలో ఆ విద్యార్థి తల్లిదండ్రుల రోదన చూపరులను కంటతడి పెట్టించింది. రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్ పీలేరు ప్రభుత్వ ఆస్పత్రి చేరుకుని రెడ్డి మోక్షిత్ కుటుంబీకులను ఓదార్చారు. తమ బిడ్డ మృతిపై అనుమానాలు ఉన్నాయని చెప్పడంతో సంఘటనపై సమగ్ర విచారణకు కలెక్టర్ శ్రీధర్ ఆదేశించారని, విచారణలో తప్పు తేలితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని వారికి నచ్చజెప్పారు. అక్కడే ఉన్న గురుకులం ప్రిన్సిపాల్, ఇతర సిబ్బందిని డీఈవో సుబ్రహ్మణ్యంతో కలిసి విచారించారు. రెడ్డి మోక్షిత్ మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఎఫ్, డీబీఎస్ఎఫ్ విద్యార్థి సంఘాలు, స్థానిక ప్రజాసంఘాల నేతలు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ వారితో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. డీఈవో సుబ్రహ్మణ్యం ఆదివారం సాయంత్రం గ్యారంపల్లెలోని గురుకులానికి చేరుకుని సంఘటనపై ఉపాధ్యాయులను విచారించారు. రెడ్డి మోక్షిత్ మృతి సంఘటనపై కలెక్టర్ విచారణకు ఆదేశించారని, పోస్టుమార్టం నివేదిక అనంతరం బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని ఆర్డీవో స్పష్టం చేశారు.

చెరువులో పడి ఇద్దరు యువకుల మృతి



మృతిచెందిన శ్రీకాంత్, ఆనంద్‌బాబు


చిల్లకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం అన్నంబాక గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు చెరువులో పడి ఇద్దరు యువకులు మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు.. వెంకటేశ్వర్లు, నాగమణి దంపతుల కుమారుడు శ్రీకాంత్(18), దావీదు, సంధ్య దంపతుల కుమారుడు ఆనంద్‌బాబు(18), మరో యువకుడు కల్యాణ్ ఆదివారం గ్రామ సమీపంలోని మర్రిగుంట చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లారు. ప్రమాదవశాత్తు శ్రీకాంత్ చెరువులో పడిపోవడంతో అతడిని కాపాడేందుకు ప్రయత్నిస్తూ ఆనంద్‌బాబు కూడా నీటిలో మునిగిపోయాడు. దీనిని గమనించిన కళ్యాణ్ కేకలు వేస్తూ స్థానికులకు సమాచారం అందించాడు. గ్రామస్తులు చెరువులో దిగి గాలించగా శ్రీకాంత్, ఆనంద్‌బాబు మృతదేహాలు లభ్యమయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచే ప్రభుత్వ భూముల సర్వే

తిరుపతి అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల పరిధిలోని ప్రభుత్వ భూములను సోమవారం నుంచి సర్వే చేయనున్నారు. పక్కాగా రికార్డుల్లోకి ఎక్కించి, సూచిక బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. జీవకోన, ఎర్రమిట్ట, తిమ్మనాయుడుపాళెం, అక్కారంపల్లి, మంగళం, తుడా క్వార్టర్స్ బొమ్మల క్వార్టర్స్, కోళ్లఫారం, శెట్టిపల్లి, కొర్లచెన్నాయిగుంట, కొరమేనుగుంట తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు, కాలువ, చెరువుల పోరంబోకు స్థలాలున్నాయి. పారదర్శకంగా సర్వే చేసి, ఈనెల 20వ తేదీలోపు నివేదిక అందజేయాలని అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి అధికారులను ఆదేశించారు. పొరపాట్లు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి భూ ఆక్రమణలు ఎక్కువైన నేపథ్యంలో ఉన్న భూములను కాపాడుకునే ప్రయత్నంలో భాగంగానే ఈ సర్వే చేస్తున్నారన్న ప్రచారం సాగుతోంది.

సాగునీటి సంఘాల ఎన్నికలు షురూ

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలు షురూ అయ్యాయి. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికలను విస్మరించింది. చంద్రబాబు నాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో సాగునీటి సంఘాలకు జీవపోసింది. తొమ్మిదేళ్ల తర్వాత వీటికి ఎన్నికలు జరగనున్నాయి. జిల్లాలోని 608 చెరువులు, రెండు మీడియం ప్రాజెక్టులకు ఈనెల 23వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. సుమారు 3,800 మంది రైతులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. సభ్యుల ఎన్నిక పూర్తయ్యాక సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులను అదే రోజు ఎన్నుకుంటారు. ఎన్నికల విధులకు జిల్లాలో 3,600మందిని నియమించారు. వీరిలో ఉపాధ్యాయులు, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు. ఒక్కో సంఘానికి ఎన్నికల అధికారి, సహాయ ఎన్నికల అధికారి, ప్రతి ప్రాదేశికం(టీసీ)కు పీవో, ఏపీవోలను నియమించారు. జిల్లాలో అరణియార్, స్వర్ణముఖి మీడియం ప్రాజెక్టుతోపాటు 608 చెరువులకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ 610 కింద 2,00,711ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. జిల్లా స్థాయిలో ఇప్పటికే ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇక, 13 నుంచి మండల స్థాయిలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. మైనర్ ఇరిగేషన్‌లో ఆరుగురిని సభ్యులుగా ఎన్నుకుంటారు. 'ఈనెల 23న సాగునీటి సంఘాల ఎన్నికలను పక్కాగా నిర్వహించడానికి చర్యలు చేపట్టాం. ఇప్పటికే ఓటర్ల జాబితా సిద్ధమైంది. ఆయా పంచాయతీల్లో ఓటర్ల జాబితా ప్రదర్శిస్తాం' అని టీజీపీ జీఎన్ఎస్ఎస్ సర్కిల్ ఎస్ఈ మదనగోపాల్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.



ఎస్వీయూలో ముగిసిన యువ తరంగ్





విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీ మోహన్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో మూడు రోజులుగా నిర్వహించిన 'యువతరంగ్' కార్యక్రమం ఆదివారం ముగిసింది. విజేతలకు బహుమతులు అందజేశారు. శ్రీనివాసా ఆడిటోరియంలో సాయంత్రం నిర్వహించిన ముగింపు సభలో పూతలపట్టు ఎమ్మెల్యే కె.మురళీమోహన్ ప్రసంగించారు. యూనివర్సిటీ జీవితం ఓ మరుపురాని తియ్యటి జ్ఞాపకమంటూ తాను ఎస్వీయూ పీజీ, పీహెచ్‌డీ చదువుకున్నప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. యూనివర్సిటీ చదువులు జీవితాన్ని కీలక మలుపు తిప్పుతాయని తన జీవితం నిరూపించిందన్నారు. ఎస్వీ యూనివర్సిటీ పూర్వ విద్యార్థిగా వర్సిటీ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. క్రీడా సాంస్కృతిక విషయాల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం పెరుగుతుందన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసి ఆయా రంగాల్లో వారిని ప్రోత్సహించడానికి యువ తరంగ్ నిర్వహించామని ఇన్‌చార్జి వీసీ అప్పారావు తెలిపారు. యువ తరంగ్‌లో విద్యార్థుల ఉత్సాహం చూస్తుంటే తనకు చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయని రిజిస్ట్రార్ భూపతి నాయుడు అన్నారు. వివిధ సాంస్కృతిక పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి, స్టూడెంట్ అఫైర్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ మురళీధర్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కళ్యాణ్, విద్యార్థులు, ఉద్యోగులు, కళాకారులు పాల్గొన్నారు.



పుత్తూరు పురపాలక సంఘము, మునిసిపల్ కార్యాలయము, పుత్తూరు

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ / షార్ట్ టెండర్ నోటీసు నెం.06/ఇ1/2024-25 తేది: 10-11-2024

పుత్తూరు పురపాలక సంఘము నందు Municipal General Funds నుండి 13 పనులకు గాను (టెండరు నిట్ నెం.5, 7, 17, 18, 19, 20, 21, 25/2024-25, షార్ట్ టెండరు నిట్ నెం. 6, 8, 9, 22, 23/2024-25) అర్హతలు కలిగినవారి నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు / షార్ట్ టెండర్లు ఆహ్వానించడమైనది. సదరు పనులకు సంబంధించిన పూర్తి వివరములు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ నందు చూడవలెను.

http://tender.apeprocurement.gov.in

సం/- కమిషనరు, పుత్తూరు పురపాలక సంఘం.

'సీమ' సిగలో మరో బీచ్

పర్యాటక శాఖ దృష్టి పెట్టని మరో బీచ్ జిల్లాలో ఉంది. పెద్దగా వసతులు లేకపోయినా పర్యాటకులు అధిక సంఖ్యలో వెళ్తుంటారు. ఆ బీచ్ ఎక్కడుంది? ఎలా వెళ్లాలి?

- పూర్తి వివరాలు 6లో -





రష్యన్ల రాహుకేతు పూజలు

జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం సుమారు 40మంది రష్యా దేశస్తులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆలయంలో శిల్పకళ అద్భుతంగా ఉందని తెలిపారు. తాము స్వామి అమ్మవార్లను దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సారె ట్రయల్ రన్

తిరుచానూరులో ఈనెల 28 నుంచి నిర్వహించనున్న ని పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఆదివారం శ్రీవారి సారె ట్రయల్ రన్ నిర్వహించారు. ఉత్సవాల్లో చివరి రోజు (వచ్చే నెల 6న) పంచమీతీర్థం సందర్భంగా అమ్మవారికి తిరుమల నుంచి శ్రీవారు సారె పంపడం ఆనవాయితీ. ఈ క్రమంలో ట్రయల్ రన్‌గా ఆదివారం ఉదయం డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏవీఎస్వో సతీష్‌కుమార్, తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్, ఇతర టీటీడీ అధికారులు, సిబ్బంది కలిసి ఏనుగులపై అమ్మవారి నమూనా సారె తెచ్చారు. కోమలమ్మ సత్రం నుంచి రాములవారి గుడి, గాంధీరోడ్డు మీదుగా గోవిందరాజస్వామి ఆలయం, గ్రూప్‌థియేటర్స్, ఆర్టీసీ బస్టాండు, పూర్ణకుంభం సర్కిల్, లక్ష్మీపురం, పద్మావతిపురం మీదుగా తిరుచానూరు ఆలయం వరకు తీసుకువచ్చారు. సూపరింటెండెంట్లు రమేష్, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి





ఆహ్లాదంగా పర్యాటకులు



సీమ సిగలో మరో బీచ్
శ్రీనివాససత్రం

అభివృద్ధి పరిస్తే గొప్ప పర్యాటక క్షేత్రం అవుతుంది



చెన్నై నుంచి కృష్ణపట్నంపోర్టుకు వెళ్తున్న స్టీమర్

ఎండకి మెరిసే ఇసుక మీదకి ఉరకలెత్తే అలలు.. సముద్రంలో సాగిపోయే పడవలు.. దూరంగా మసక దృశ్యంలా కృష్ణపట్నం ఓడరేవు.. పోర్టు దిశగా వెళ్లే స్టీమర్లు.. తీరంలో సవకతోపుల్లో చెట్ల కింద సేదదీరే పడవలు.. జీడిమామిడి చెట్లు.. మాల్దీవుల వర్ణన కాదు ఇది. మన తిరుపతి జిల్లాలో ప్రసిద్ధికెక్కని ఒక బీచ్ అందాలు ఇవి. కోట మండలంలోని కొత్తపట్నం పంచాయతీలోని శ్రీనివాససత్రం సముద్రతీరం సౌందర్యం వర్ణనాతీతం. పర్యాటక ప్రదేశంగా దీనిని గుర్తించి అభివృద్ధి పరచలేదు కానీ, సమీప ప్రాంతాల ప్రజలు సెలవు రోజుల్లో వచ్చి ఆహ్లాదంగా గడుపుతుంటారు. లోతు తక్కువగా ఉండడంతో అలలతో సయ్యాటలాడుతుంటారు. నీలపు రంగు పులుముకున్న సముద్రమూ, ఆకాశమూ నేపథ్యంగా ఫోటో షూట్‌లు చేసుకుంటూ ఉంటారు. ఇప్పటిదాకా ఒక్క అవాంఛనీయ సంఘటన కూడా ఇక్కడ జరగలేదంటే ఇదెంత ప్రమాదరహితమైన ప్రదేశమో అర్థం చేసుకోవచ్చు. అభివృద్ధి పరిస్తే అద్భుతమైన పర్యాటక కేంద్రంగా శ్రీనివాస సత్రం బీచ్ రూపు మారుతుంది.

జిల్లాల విభజనతో రాయలసీమకు సముద్రం కానుకగా వచ్చింది. ఆహ్లాదకరమైన పర్యాటక ప్రదేశంగా కోట సమీపంలోని తూపిలిపాళెం బీచ్ గుర్తింపు పొందింది. పెద్దగా వసతులు లేకపోయినా పర్యాటకులు పెద్ద సంఖ్యలో వెళ్తుంటారు. అయితే రాష్ట్ర పర్యాటక శాఖ కన్ను పడని మరొక అందమైన బీచ్ కూడా కోట మండలంలో ఉంది. మంచి రోడ్డు వేసి, వసతులు కల్పిస్తే ఈ రెండు బీచ్‌లూ ఆదాయవనరులుగా మారుతాయి.

- కోట, ఆంధ్రజ్యోతి

శ్రీనివాససత్రానికి ఇలా వెళ్లొచ్చు..

గూడూరు నుంచి కోట మీదుగా వెళ్లాలి. గూడూరు నుంచి కోటకు 26 కిలోమీటర్లు. అక్కడి నుంచి 20 కిలోమీటర్ల దూరంలో శ్రీనివాససత్రం ఉంటుంది. ఇక్కడిదాకా తారు రోడ్డు ఉంది. ఇక్కడి నుంచి 500 మీటర్ల దూరంలో సముద్ర తీరం ఉంటుంది. సొంత వాహనాల్లో గానీ, కోట నుంచి ఆటోల్లోగానీ వెళ్లాలి. శ్రీనివాససత్రంలో టిఫిన్, భోజనం వంటివి లభించవు. ఇక్కడికి 5 కిలోమీటర్ల దూరంలోని గోవిందపల్లిలో మాత్రం హోటళ్లు ఉంటాయి.

సముద్రంలో రెండు దీవులు

2022లో కేంద్ర పర్యాటక శాఖ బృందం ఈ బీచ్‌ను పరిశీలించింది. అభివృద్ధి పరచడానికి ఉన్న అవకాశాలను అధ్యయనం చేసింది. గోవిందపల్లిపాళెం-శ్రీనివాససత్రం మధ్య ప్రాంతంలో తీరానికి రెండు కిలోమీటర్ల దూరంలో సముద్రంలో రెండు దీవులు ఉండడాన్ని గుర్తించింది. దిబ్బల్లా ఉన్న వీటిలో చెట్లు కూడా ఉన్నాయి. వీటిని అభివృద్ధి పరిస్తే పర్యాటకుల రాకపోకలు పెరిగే అవకాశం ఉంటుంది. అలాగే తీరం వెంబడి చిన్న చిన్న పిక్‌నిక్ పాయింట్‌లు ఏర్పాటు చేయచ్చని భావించింది. అయితే ఆ నివేదిక అతీగతీ ఏమైందో మాత్రం తెలియదు.

శ్రీనివాససత్రం నుంచి కనిపిస్తున్న కృష్ణపట్నం పోర్టు



క్రైం కార్నర్

22కిలోల గంజాయి స్వాధీనం

- ఆరుగురు నిందితుల అరెస్ట్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సుబ్బరామిరెడ్డి

చంద్రగిరి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో 22 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. సీఐ సుబ్బరామిరెడ్డి కథనం మేరకు ముందస్తు సమాచారంతో ఎం.కొంగరవారిపల్లి సమీపంలోని జగనన్న కాలనీలో పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. విశాఖపట్నానికి చెందిన సామిరెడ్డి బేబీ పరిసరాల్లో యానాదుల నుంచి గంజాయి సేకరించి తిరుపతిలో విక్రయించేది. తిరుపతికి చెందిన రమ్య ఇందుకు సహకరించేది. ఈక్రమంలో సామిరెడ్డి బేబీ విశాఖ నుంచి గంజాయి తీసుకువచ్చాడు. దానిని కొనుగోలు చేసేందుకు తిరుచానూరుకు చెందిన నరసింహ, కార్తీక్, ప్రవీణ్, మణికంఠ, అబ్దుల్ కయాం జుబేర్(ఉత్తరప్రదేశ్)లు ఎం.కొంగువారిపల్లి దగ్గర జగనన్న కాలనీకి వచ్చారు. అదే సమయంలో రెవెన్యూ అధికారుల సహకారంలో పోలీసులు, దాడులు చేశారు. ఆరుగురిని అరెస్టు చేశారు. రమ్య పరారైయింది. గంజాయితోపాటు బైక్, కొంతనగదు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ రూ.3.82 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితులను కోర్టుకు తరలించారు. మీడియా సమావేశంలో ఎస్ఐ అనిత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మయ్యది సుపారీ హత్య: డీఎస్పీ

- పది మంది నిందితుల అరెస్టు



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

వెంకటగిరి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి మండలం జయంపు గ్రామంలో ఈ నెల 5వ తేదీ జరిగిన అల్లం లక్ష్మయ్య హత్య కేసును పోలీసులు చేదించారు. లక్ష్మయ్యను ప్రత్యర్థులు సుపారీ ఇచ్చి హత్య చేయించినట్లు డీఎస్పీ రమణ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియా సమావేశంలో హత్యకు దారితీసిన వివరాలను వెల్లడించారు. జయంపు గ్రామానికి చెందిన అల్లం లక్ష్మయ్యకు అదే గ్రామానికి చెందిన శివారెడ్డి కల్యాణ రెడ్డి కుటుంబాల మధ్య పాత కక్షలు ఉండేవి. ఈ నెల 2వ తేదీన రెండు కుటుంబాల మధ్య వివాదం చోటుచేసుకొంది. ఇరువర్గాలకు గాయలవడంతో బాలాయపల్లి పోలీసు స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకొన్నారు. ఈ నేపథ్యంలో లక్ష్మయ్యను హత మార్చాలని కల్యాణ రెడ్డి పథకం రచించారు. వ్యాపారం చేసుకొంటూ తిరుపతిలో వున్న కల్యాణ రెడ్డి అన్నదే కొందరు మిత్రులను కలిసి లక్ష్మయ్య హత్య చేసేందుకు రూ.లక్ష ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకొన్నాడు. ఈనెల 5వ తేదీన తిరుపతి నుంచి టెంపోలో 10మంది జయంపు గ్రామానికి చేరుకొన్నారు. లక్ష్మయ్య ఇంటికి వెళ్లి తాము పోలీసులు అని చెప్పారు. విచారణ కోసం రావాలంటూ లక్ష్మయ్యను వ్యాన్‌లోకి ఎక్కించుకొని తీసుకెళ్లారు. ఇదంతా గమనించిన స్థానికులు వెంకటగిరిలో ఉన్న లక్ష్మయ్య అల్లుడికి ఫోన్ చేసి మీ మామను పోలీసు యూనిఫాంలో వచ్చిన కొందరు తీసుకెళ్లారని, అయితే వారు పోలీసులు కాదేమోనని అనుమానం వ్యక్తం చేశారు. దీంతో లక్ష్మయ్య అల్లుడు తన మామని ఎవరో కిడ్నాప్ చేశారని బాలాయపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు 6వ తేదీ తెల్లవారుజామున హస్తకావేరి పంట పొలాల్లో లక్ష్మయ్య రక్తగాయాలతో పడి ఉండటాన్ని గుర్తించారు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ లక్ష్మయ్య మృతి చెందాడు. హంతకులు తాము వచ్చిన టెంపోను అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. ఆదివారం వెంకటగిరి రైల్వేస్టేషన్‌లో గూడూరు వెళ్లే ట్రైన్ కోసం నిరీక్షిస్తున్న 10 మంది అనుమానాస్పదంగా తిరుగుతున్నారని సమాచారం అందడంతో పోలీసులు వెళ్లి వారిని అదుపులోకి తీసుకుని విచారించగా లక్ష్మయ్య హత్య విషయం బయట పడింది. నిందితులందరినీ అరెస్టు చేశారు. కోర్టులో హాజరు పరుస్తామని డీఎస్పీ తెలిపారు. హత్య కేసును చేదించిన వెంకటగిరి సీఐ రమణ, బాలాయపల్లి ఎస్ఐ గోపిని అభినందించారు.

అప్పుల బాధ తాళలేక..



మృతి చెందిన లోకనాథం

బుచ్చినాయుడుకండ్రిగ, నంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంట సాగుకు అప్పుచేసి పెట్టుబడి పెట్టారు. ఈసారైనా ఆదాయం రాకపోతుందా అని సోదరుడి పొలంతో సహా ఐదు ఎకరాల్లో సేద్యం చేస్తూనే వచ్చారు. ఏటా పెరిగిన వడ్డీతో అప్పు రూ.13 లక్షలకు చేరుకుంది. ఆర్థిక ఇబ్బందులు తాళలేక శనివారం రాత్రి బుచ్చినాయుడు కండ్రిగ మండలం వెస్ట్‌వరత్తూరుకు చెందిన రైతు లోకనాథం పురుగుల మందు తాగారు. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ విశ్వనాథ నాయుడు కేసు నమోదు చేశారు.



కుటుంబ సభ్యులతో భానుప్రకాష్‌రెడ్డికి ఘన సన్మానం

టీటీడీ సభ్యుడు భానుకు ఘన సన్మానం

- కృషికి తగిన పదవి అన్న వక్తలు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల సభ్యుడు జి.భానుప్రకాష్‌రెడ్డికి ఆయన మిత్రబృందం ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతిలోని మహతిలో సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆయన కృషికి తగిన గుర్తింపే.. ఈ పదవి అని పలువురు పేర్కొన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలు ఎవరూ టీటీడీ పరిపాలనలో జోక్యం చేసుకోవద్దని సీఎం చంద్రబాబు టీడీఎల్పీ సమావేశంలో ఆదేశించిన మేరకే తాము ఉంటున్నామన్నారు. అయితే, పద్మావతి అమ్మవారు, శ్రీవారి మెట్టు, శ్రీనివాసమంగాపురం, చంద్రగిరి కోట తదితర ప్రాంతాలతోపాటు నియోజకవర్గంలో అభివృద్ధికి టీటీడీ సభ్యుడిగా భానుప్రకాష్‌రెడ్డి సహకరించాలని కోరారు. టీటీడీ సభ్యుడిగా భానుప్రకాష్‌రెడ్డి రెండోసారి నియమితులు కావడం ఆయన శ్రమకు భగవంతుడు ఇచ్చిన ప్రతిఫలమని పూతలపట్టు ఎమ్మెల్యే మురళి అన్నారు. కలియుగ దైవం శ్రీవారి ఆలయాన్ని ఎవరూ పరిపాలించలేరని.. అందుకే టీటీడీ పాలకమండలిని ధర్మకర్తల మండలిగా వ్యవహరించాలని మాజీ జేఈవో శ్రీనివాసరాజు సూచించారు. తిరుపతిలోని టీటీడీ విద్య, వైద్య సంస్థల్లో స్థానికులకు ఉచిత విద్య, వైద్యం అందించేలా భానుప్రకాష్‌రెడ్డి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ కోరారు. టీటీడీపట్ల చిన్న అపచారం, దుష్ప్రచారం జరిగినా పార్టీలకు అతీతంగా ఏకం కావాలని తుడా మాజీ ఛైర్మన్ ఎన్వీ ప్రసాద్ పిలుపునిచ్చారు. తిరుమల స్థానికులు ఎంతో త్యాగం చేశారని, వారికి న్యాయం చేసేందుకు భానుప్రకాష్‌రెడ్డి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. శ్రీవారి అనుగ్రహం, తన తల్లిదండ్రులు, కుటుంబం చేసుకున్న పుణ్యఫలంతోనే తాను రెండోసారి సభ్యుడిని కాగలిగానంటూ భానుప్రకాష్‌రెడ్డి భావోద్వేగం చెందారు. ఇది హోదా కాదు.. బాధ్యతన్నారు. శ్రీవారిపట్ల, సనాతన ధర్మం పట్ల ఎటువంటి అపచారం జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. మొదటి సమావేశంలోనే పాలక మండలి స్థానంలో ధర్మకర్తల మండలిగా వ్యవహరించాలని ప్రతిపాదిస్తానన్నారు. స్విమ్స్‌ను మరింతగా అభివృద్ధి చేయడమే తన తొలి ప్రాధాన్యంగా చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అన్ని అపశ్రుతులను సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, ఆ క్రమంలోనే తానూ శ్రీవారికి, భక్తులకు సేవ చేస్తానని చెప్పారు. తనను సభ్యుడిగా నియమించిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, జనసేనాని పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, తన పార్టీ అధినాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ మాజీ సభ్యుడు అనంత్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మోహన్‌రాజు, బీజేపీ నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి, సామంచి శ్రీనివాస్, కోలా ఆనంద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, పొన్నగంటి భాస్కర్, జీవన్‌రాయల్, క్రెడాయ్ అధ్యక్షుడు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వేదికపై మాట్లాడుతున్న శ్రీనివాసరాజు



ఆర్మీలో ఎంపిక కోసం పరుగు పందెంలో పాల్గొన్న అభ్యర్థులు

గెలుపే లక్ష్యంగా పరుగెత్తాలి

- యువతకు పిలుపునిచ్చిన జేసీ అదితిసింగ్
- కడపలో అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

కడప స్పోర్ట్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి హాజరైన అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ఆత్మవిశ్వాసంతో పరుగెత్తాలని జేసీ అదితిసింగ్ పిలుపునిచ్చారు. కడపలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ (డీఎస్ఏ) స్టేడియంలో ఆదివారం వేకువజామున 3 గంటలకు ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఎంపికలు రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నల్ పునీత్ అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించి.. ఫిజికల్ టెస్ట్‌కు 13 జిల్లాల నుంచి అభ్యర్థులు పాల్గొననున్నారు. మొదటి దశ పరుగును జేసీ అదితిసింగ్ జెండా ఊపి ప్రారంభించారు. ప్రతిఒక్కరూ విజయకాంక్షతో ముందడుగు వేయాలన్నారు. ఈ ఎంపికలో విజయం సాధించి దేశానికి భద్రతనిచ్చే గొప్ప యువశక్తిగా నిలవాలని ఆకాంక్షించారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ ర్యాలీకి కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, కర్నూలు, నంద్యాల,అనంతపురం, సత్యసాయి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి 4000మంది అభ్యర్థులు హాజరు కానున్నారు.వీరిలో రోజుకు 800 మంది చొప్పున అభ్యర్థులకు ఐదురోజులపాటు ఎంపిక పరీక్షలు నిర్వహిస్తారు. అభ్యర్థులు ఎవరు ఏరోజు రావాలనేది ఆర్మీ అధికారులు ముందుగానే కాల్ లెటర్లు పంపించారు.





ఆర్మీ ఎంపిక కోసం వివిధ సామర్థ్య పరీక్షలు

ముద్దుగారే యశోద

శిల్పారామంలో అలరించిన నృత్యప్రదర్శన



తిరుచానూరురోడ్డులోని శిల్పారామంలో వారాంతపు సెలవులో భాగంగా ఆదివారం చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యరూపకం అలరించింది. శివగౌరి నృత్యాలయం కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు. భావిష, ఆశ్రిత, కీర్తన, ధామిని, షన్విక, హనన్య, శ్రీనిధి, సహస్ర, ప్రియ, రోషిణి తదితరులు నాగేంద్ర హరాయ, సౌభాగ్య లక్ష్మి, వక్రతుండ మహాకాయ, మహాగణపతిం, ముద్దుగారే యశోద, బ్రహ్మమొక్కటే, శ్రీమన్నారాయణ వంటి కీర్తనలకు నృత్యం చేశారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లి సత్కరించి జ్ఞాపికలు అందజేశారు

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

శ్రీవారి హుండీ ఆదాయం రూ. 3. 79 కోట్లు

తిరుమల, నవంబరు10(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.79 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈ ఆదాయ వివరాలను టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 73,558 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 32,675 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

రాష్ట్రాభివృద్ధి పరుగులు: పాశం



తిరుపతి బస్సు సర్వీస్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం

కోట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ అన్నారు. కోట ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం వాకాడు డిపోకు చెందిన కోట, తిరుపతి, కోట, నెల్లూరు బస్సు సర్వీసులను డీఎం ముప్పాళ్ల పెంచులయ్యతో కలిసి ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. అదేవిధంగా కోటలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యేతో పాటు పలువురు దాతల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేశారు. అలాగే తిన్నెలపూడి ప్రసన్న వెంకటేశ్వర ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ కుంభాభిషేకంలో ఎమ్మెల్యే సునీల్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఐదేళ్లపాటు అంధకారంలో ఉండిపోయిందన్నారు. నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నది తమ లక్ష్యమని, ఇందులో ఎన్ని ఆటంకాలు ఎదురైనా వెనుకడుగువేసే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, నెల్లూరు మోహన్‌రెడ్డి, తీగల సురేష్‌బాబు, దారా సురేష్, షంషుద్దీన్, మస్తాన్‌బాషా, భాస్కర్‌రెడ్డి, పోలయ్య, చిల్లకూరు దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయండి

ఓజిలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనరు విజయకుమార్ నాయుడు అన్నారు. ఆదివారంఆయన మండలంలోని యూనిట్ ఇన్‌చార్జిలు, నాయకులతో మాట్లాడారు. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు సూళ్లూరుపేట నియోజకవర్గం ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం సూచనలతో సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని సూచించారు.

వైసీపీకి వినోద్‌రెడ్డి రాజీనామా


ఎమ్మెల్యే సమక్షంలో రాజీనామా పత్రాన్ని చూపుతున్న వినోద్‌రెడ్డి

కోట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఆదివారం కోటలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సమక్షంలో వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తన రాజీనామ పత్రాన్ని వైసీపీ జిల్లా అధ్యక్షుడికి పంపుతున్నట్లు తెలిపారు. అలాగే కోట ఎంపీటీసీ మోబిన్‌బాషా, సర్పంచు వెంకటరమణమ్మతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు వైసీపీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. వీరంతా మంత్రి నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరనున్నట్లు ఎమ్మెల్యే పాశం చెప్పారు.

సత్యనారాయణ వ్రతం పూజలు


సామూహిక సత్యనారాయణ వ్రతం పూజల్లో భక్తులు

గూడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక గమళ్లపాళెంలోని రుక్మాభాయి సమేత పాండురంగ విఠలనాథ స్వామి ఆలయంలో ఆదివారం కార్తీకమాసం సందర్భంగా సత్యనారాయణస్వామి వ్రతం పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేషపూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో వ్రతపూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎన్‌బీకేఆర్ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి

కోట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు జేఎన్‌టీయూఏ హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. జనవరిలో తమిళనాడు రాష్ట్రం సెలంలోని పెరియార్ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ హ్యాండ్‌బాల్ పోటీల్లో కళాశాలకు చెందిన ప్రసాద్, మనోప్రియ, వెంకటసౌమ్య, వినయ్ పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, ఆయా విభాగాధిపతులు షీల్డ్‌లు, మెమొంటోలతో అభినందించారు.

లైసెన్సు లేని వాహన చోదకులపై చర్యలు

ఓజిలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని ఎస్ఐ స్వప్న స్పష్టం చేశారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ మద్యం తాగి, సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడపడం నేరమన్నారు. వాహనదారులు అన్ని పత్రాలు కలిగి ఉండటంతో పాటు హెల్మెట్ ధరించాలని ఎస్ఐ సూచించారు.

పేదలకు దుస్తుల పంపిణీ


దుస్తులు అందజేస్తున్న ప్రగతిసేవాసంస్థ సభ్యులు

గూడూరు అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీనగర్‌లోని ప్రగతిసేవాసంస్థ కార్యాలయంలో ఆదివారం పేదలకు దుస్తులు, ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాధయ్య, శివశంకర్, శశిధర్, మంజుభార్గవి, రాము, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ మనోజ్‌కుమార్

గూడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంబలేరు బ్రిడ్జి వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఆటో డ్రైవర్ మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ వివరాల మేరకు... మండలంలోని పోటుపాళెం గ్రామానికి చెందిన శివప్రసాద్(19) పాల ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి నెల్లూరు జిల్లా మనుబోలు నుంచి ఆటోలో పాలు తీసుకుని గూడూరుకు వస్తుండగా పంబలేరు బ్రిడ్జి వద్ద ఓ కారు అదుపుతప్పి ఆటోను ఢీకొంది. దీంతో ఆటో నడుపుతున్న శివప్రసాద్ అక్కడిక్కడే మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

నాయుడుపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పండ్లూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం తెల్లవారుజామున పండ్లూరు సమీపంలో రోడ్డు పక్కన ఆగిఉన్న లారీని చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళ్లే మరో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ నక్వసింగ్‌కు తీవ్రగాయాలయ్యాయి. అతడిని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యసేవల కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉగ్గపట్టి ఉండాల్సిందే..!

పట్టణంలో మరుగుదొడ్లు లేక జనం అవస్థలు




చెంగాళమ్మ ఆలయ సమీపంలో నిర్మించిన మరుగుదొడ్ల ఎదుట దుకాణం - ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఆటోస్టాండులా మరుగుదొడ్లు

సూళ్లూరుపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణ, పరిసరాల శుభ్రత లక్ష్యంగా సామాజిక మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉండగా సూళ్లూరుపేట పట్టణంలో పలుచోట్ల వాటి ఊసేలేకుండా పోయింది. ఉన్న చోట వాటి నిర్వహణ కరువైంది. దీంతో వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సూళ్లూరుపేట నియోజకవర్గ కేంద్రం కావడంతో చుట్టుపక్కల మండలాలకు చెందిన ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. బజారు కూడలి, బస్టాండు సెంటర్, షార్ బస్టాండు వద్ద రద్దీ ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా రెవెన్యూ, ఆర్డీవో కార్యాలయం, మండల పరిషత్, మున్సిపాలిటీ, విద్యుత్, సబ్ రిజిస్ట్రార్ తదితర ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలు ఎక్కువగా వస్తుంటారు. వీరంతా తమ పనిపూర్తయ్యే వరకు ఇక్కడే నిరీక్షించాల్సి వస్తోంది. ఈ సమయంలో మూత్ర, మల విసర్జనకు వెళ్లాలంటే మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. చెంగాళమ్మ ఆలయానికి వెళ్లే దారిలో అయ్యప్పస్వామి ఆలయం వద్ద మరుగుదొడ్లు ఉన్నా అవి వినియోగంలో లేవు. వాటి వద్ద కొందరు వ్యాపారస్తులు దుకాణాలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా ఆర్టీసీ బస్టాండు సమీపంలోని బాలికల ఉన్నత పాఠశాల పక్కన రోటరీ సహకారంతో నిర్మించిన మరుగుదొడ్లు వినియోగంలో ఉన్నా ముందర ఆటోస్టాండు ఉండడంతో జనానికి అసౌకర్యంగా ఉంది.

ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఇదే పరిస్థితి

ఆర్డీవో, మున్సిపాలిటీ, రెవెన్యూ, మండల పరిషత్, సబ్ రిజిస్ట్రార్ తదితర ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. ఆయా కార్యాలయాల సమీపంలో మరుగుదొడ్ల సౌకర్యం లేదు. కొన్ని కార్యాలయాల వద్ద ఉన్నా సిబ్బందికి మాత్రమేనని బోర్డులు పెట్టారు. అధికారులు స్పందించి పట్టణంలో మరుగుదొడ్లను నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మాతృభాషలోనే బోధన జరగాలి: మాజీ ఎమ్మెల్సీ విఠపు


సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం

సూళ్లూరుపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యా విధానం కోసం జారీ చేసిన 117 జీవోను రద్దు చేసి మాతృభాషలోనే బోధన జరిగే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన స్వర్ణోత్సవ సంబరాల వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా విఠపు మాట్లాడుతూ 50సంవత్సరాల యూటీఎఫ్ ప్రస్థానంలో ఎందరో త్యాగధనుల ఫలితంగా ఉపాధ్యాయులకు అనేక రకాల సౌకర్యాలు సమకూరాయన్నారు. సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించి, హైస్కూల్ స్థాయిలో రెండు మీడియంలను ఎంచుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించాలన్నారు. ఈ సందర్భంగా తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్.నాయుడు, బాబురెడ్డి, చంద్రశేఖర్, శేఖర్, సునీలా పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల హక్కుల సాధనే యూటీఎఫ్ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న నవకోటేశ్వరరావు

గూడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల హక్కుల సాధనే లక్ష్యంగా 50 ఏళ్లుగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు చేపట్టడం జరిగిందని ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ ఉద్యమాల ఫలితంగా ఉపాధ్యాయులకు ఇంక్రిమెంట్‌లు, ఇతర సదుపాయాలు సాధించడం జరిగిందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించు కునేందుకు అందరం సమిష్టిగా ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం యూటీఎఫ్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నిర్మల, సూర్యప్రకాష్, రామచంద్రయ్య, విజయభాస్కర్, సుధీర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మదీనా కాలనీలో కార్డెన్ సెర్చ్


బైక్ పత్రాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

తడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తడకండ్రిగ పంచాయతీ మదీనా కాలనీలో ఆదివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తెల్లవారుజామున నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో పోలీసులు ఇంటింటా తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తుల వివరాలను సేకరించారు. సరైన పత్రాలు లేని 13 బైక్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో డీఎస్పీతో పాటు సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐలు కొండపనాయుడు, బ్రహ్మనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే...

చిల్లకూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నేరాలను నియంత్రించేందుకే గ్రామాల్లో కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు సీఐ కిషోర్‌బాబు అన్నారు. ఆదివారం స్థానిక మిక్సిడ్‌కాలనీ, వడ్డిపాళెం ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పలు ఇళ్లలో తనిఖీలు చేశారు. సరైన ధృవీకరణ పత్రాలు లేని పలు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా కొత్తవారికి ఇళ్లను అద్దెకు ఇచ్చే సమయంలో ఆధార్‌కార్డు పరిశీలించి పూర్తివివరాలు తెలుసుకుని ఇళ్లను అద్దెకు ఇవ్వాలని సీఐ సూచించారు. గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానితులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్ర మంలో ఎస్ఐలు సురేష్‌బాబు, మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వన భోజనం



వనభోజన కార్యక్రమంలో భక్తులు

గూడూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక త్యాగరాజవీధిలోని కల్యాణ వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం కార్తీకమాసం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హజరై స్వామివారి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ఆవరణలో వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉచిత వైద్య శిబిరం

సూళ్లూరుపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రోటరీ క్లబ్, నియో కేర్ క్లినిక్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రోటరీ కంటి వైద్యశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు నందిత, ప్రవీణ్ 75 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు తిరుమూరు సుధాకర్ రెడ్డి, కార్యదర్శి రామకృష్ణ, ప్రాజెక్టు చైర్మన్ కుమారస్వామి, నియో కేర్ క్లినిక్ సిబ్బంది పాల్గొన్నారు.

కమనీయం... వెంకటేశ్వరుడి కల్యాణం


స్వామి అమ్మవార్లకు కళ్యాణం జరుపుతున్న వేదపండితులు

కోట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిన్నెలపూడి పంచాయతీలో గల లక్ష్మక్కకండ్రిగలో ఆదివారం రాత్రి పద్మావతి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. వందలాది మంది భక్తుల సమక్షంలో ప్రసన్న వెంకటేశ్వరుడికి పద్మావతి, అలివేలు అమ్మవార్లకు తాళికట్టి సన్నివేశాలను పండితులు భక్తులకు చూపెట్టారు. భక్తులు పోటాపోటీగా కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా స్వామివారి ఆలయ నూతన ప్రారంభం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సమక్షంలో వైభవంగా జరిగాయి.

శబరిమలైకు సైకిల్‌యాత్ర


శబరిమలై సైకిల్‌యాత్రలో అయ్యప్ప భక్తులు

గూడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు గ్రామానికి చెందిన అయ్యప్ప భక్తులు శబరిమలైకు ఈనెల 6వ తేదీన చేపట్టిన సైకిల్‌యాత్ర ఆదివారం గూడూరుకు చేరుకుంది. కొత్తగా స్థానిక కాశీ లేఅవుట్‌లో నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని భక్తులు పూజలు చేశారు. అనంతరం శబరిమలైకు సైకిల్‌యాత్రను కొనసాగించారు.

తాళమ్మకు ప్రత్యేక పూజలు

గూడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గూడూరు గ్రామదేవత తాళమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మాతా పరమేశ్వరికి...

నాయుడుపేట టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అగ్రహారపేటలో వెలసిన మాతా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర పూజలు నిర్వహించారు.

ముత్యాలమ్మకు...

చిల్లకూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలిసిన ముత్యామ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యంగా నివేదించారు. ఆలయం ఎదుట త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అక్రమాలు చేయలేదని వెంకటేశ్వరస్వామిపై ప్రమాణం చేస్తావా?

● వైసీపీ నేత కామిరెడ్డికి టీడీపీ నేతల సవాల్


సమావేశంలో మాట్లాడుతున్న సంచి కృష్ణయ్య

పెళ్లకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి నేతలపై నిత్యం అసత్య ఆరోపణలు చేస్తున్న వైసీపీ నేత, ఎన్డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడలేదని ఆయన విశ్వసించే వెంకటేశ్వరస్వామిపై ప్రమాణం చేయగలరా అని టీడీపీ నేతలు ప్రశ్నించారు. ఆదివారం మండలంలోని చావాలి పంచాయతీ చెక్‌పోస్టు గిరిజన కాలనీలో టీడీపీ సభ్యత్వ నమోదు జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య మాట్లాడుతూ వైసీపీ పాలనలో అధికారాన్ని అడ్డంపెట్టుకుని కామిరెడ్డితో పాటు ఆ పార్టీ నాయకులు శిరసనంబేడు సిద్దేశ్వరస్వామి కొండతో పాటు రోసనూరు భూపతేశ్వరస్వామి కొండను కొల్లగొట్టిన సంగతి ప్రజలు మర్చిపోరన్నారు. 2014-19 మధ్య టీడీపీ పాలనలో స్వర్ణముఖి నదిలో పేదలకు ఇసుకను తీసుకోనివ్వకుండా అడ్డుకునేందుకు కోర్టును ఆశ్రయించిన కామిరెడ్డి వైసీపీ అధికారంలోకి రాగానే విచ్చలవిడిగా ఇసుక, గ్రావెల్, మట్టి కొల్లగొట్టలేదా అని ప్రశ్నించారు. ఎన్నో అక్రమాలకు పాల్పడిన వైసీపీ నాయకులు కూటమి నేతలను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తప్పుడు ఆరోపణలు మానుకోకుంటే తగిన మూల్యం చెల్లించు కోక తప్పదని సత్యనారాయణరెడ్డిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నేలవల్లీ సిద్దులయ్య నాయుడు తదితరులు ఉన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధాత్రివృక్ష పూజలు


ధాత్రివృక్ష పూజల్లో భక్తులు

చిల్లకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం కార్తీకమాసం సందర్భంగా కోట వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం ఆధ్వర్యంలో ధాత్రి వృక్ష పూజలు నిర్వహించారు. అనంతరం వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు ధాత్రివృక్ష పూజల్లో పాల్గొన్ని స్వామివారిని దర్శించుకుని, వనభోజనం స్వీకరించారు.

విచారణకు హాజరైన కామిరెడ్డి

నాయుడుపేట టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రూరల్ పోలీస్ సర్కిల్ కార్యాలయానికి ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి విచారణకు ఆదివారం హాజరయ్యారు. రూరల్ సీఐ సంఘమేశ్వరరావు విచారణ చేపట్టారు. పెళ్లకూరు మండలం చిల్లకూరులో జరిగిన రెండు కేసుల్లో కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిని విచారించారు. అనంతరం బయటకు వచ్చిన కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గతంలో అమెరికాలో ఉన్న నాపై అప్పట్లో కూడా కేసులు నమోదు చేశారని అన్నారు. అక్రమ కేసులు బనాయించడం సబబుకాదన్నారు.

సురేష్‌రెడ్డికి సత్కారం


సురేష్‌రెడ్డిని సత్కరిస్తున్న నరేంద్రరెడ్డి

పెళ్లకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ నెల్లూరు రీజియన్ చైర్మన్‌గా నియమితులైన బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం నెల్లూరులోని సురేష్‌రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలుతో సత్కరించారు. అదేవిధంగా టీడీపీ నేత నరసింహయాదవ్‌కు పదవి దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు.

ఉచితంగా షుగర్ పరీక్షలు

గూడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం వైజేపీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చెన్నైకు చెందిన కార్యస్ హెల్త్‌కేర్ ఆస్పత్రి వైద్య సిబ్బంది సహకారంతో ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌వీరావు, ఎస్‌ఎల్‌ఎస్వామి పాల్గొన్నారు.



షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది